IN MEDIA PUBLICATION PVT LTD

@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com
TGBIL/25/A0512

బుధవారం
9 సెప్టెంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :69
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

# స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?




- శాసనసభ నిబంధనలను ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా
- ఏజీని ప్రశ్నించిన హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలపై పిటిషన్ వేసిన ప్రభుత్వం
- వాదనలు వినిపించిన ఏజీ
- ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారన్న ఏజీ

హైదరాబాద్

అసెంబ్లీ బయట జరిగిన పరిణామాలపై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వకేట్ జనరల్ - మిగతా 10లో



## నా వడోదరా అద్భుతం

- ప్రధాని మోదీ భావోద్వేగం
- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- అలకపాన్పు ఎక్కిన మేనమామకు ఇప్పుడు పని దొరికింది
- విపక్షాలపై మోదీ సెటైర్లు
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- 2,800 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి
- 250కుపైగా ట్రక్కుల సరుకును ఒకే రైలులో తరలించిన ఘనత
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

# రెండోరోజూ అదే 'వేడ్డి'

- ఢీ అంటే ఢీ అన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్
- అటు అసెంబ్లీలో, ఇటు బయట పోటాపోటీ వ్యూహాలు
- రాజకీయ ఆధిపత్యం కోసం రెండు పార్టీల ప్రయత్నాలు
- రాష్ట్ర మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శితో పలుమార్లు భేటీ అయిన ముఖ్యమంత్రి
- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యల విషయంలో మంత్రాంగం.. సస్పెన్షన్ తీర్మానంపై చర్చ
- అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్

అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ఢీ అంటే ఢీ రెండోరోజూ కొనసాగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటిరోజు సోమవారం బీఆర్ఎస్ నేతలు నల్ల టీ షర్టులు ధరించి రావడం, వారు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, 'అనుచిత వ్యాఖ్యల వ్యవహారంతో'పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కాగా మంగళవారం కూడా అదే వాతావరణంలో ఉభయ సభలు జరిగాయి. ఈ అంశంపై రాజకీయ ఆధిపత్యం సాధించేందుకు రెండు పార్టీలు పోటీలు పడి వ్యూహాలు రచించాయి. ఇక అసెంబ్లీ బయట కూడా ఇదే తీరు కొనసాగించాయి. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం - మిగతా 10లో

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..



- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ



- ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, ఆర్థిక సహకారంపై చర్చ!
- సెప్టెంబర్ 11న భేటీ కానున్న మోదీ, పుతిన్
- అజెండాలో ఎస్‌యూ-57 విమానాల డీల్
- వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

# తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్



- ప్రకటించిన మండలి ఛైర్మన్
- శాసన మండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూజువాణి పద్దతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్
- సెషన్ మొత్తానికి సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఛైర్మన్

హైదరాబాద్

శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి - మిగతా 10లో

## అరాచకాలను అరికట్టేందుకు అమిత్ షా శాఖ ఏం చేస్తోంది?

- దిల్లీలో మణిపురి సంగీతకారుడి కొట్టిచంపిన ఘటనపై రాహుల్‌గాంధీ స్పందన
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు దిల్లీలో భద్రత ఉందా అంటూ ప్రశ్న
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, దిల్లీ పోలీసుల తీరుపై విమర్శలు



## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

- సెప్టెంబర్‌లో దక్షిణ ద్వీపకల్పంలో వర్షాల పరిస్థితి బలహీనంగానే ఉండే అవకాశం
- ఏపీలో 45 శాతం, కేరళలో 24 శాతం వర్షపాతం లోటు
- తెలంగాణలో 8 నుంచి 10 వరకు అక్కడక్కడా వర్షాలు



# ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

- ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు
- నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటు
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు




హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. - మిగతా 10లో

# సంపాదకీయం


## 'కూలిన' జవాబుదారీతనం

దక్షిణ ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదు అంతస్థుల పెయింగ్ గెస్ట్ హాస్టల్ భవనం కుప్పకూలి, పలువురు విద్యార్థులు దుర్మరణం పాలవడం మనసులు కలచివేస్తున్నది. యాభైయేళ్ళనాటి భవనానికి బేస్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులు చేపట్టడంతో అది పేకమేడలాగా కుప్పకూలింది. అప్పటికే వర్షాలకు తడిసిముద్దయి ఉన్న ఈ భవనం బేస్‌మెంట్‌లోకి నీరు కూడా చేరివున్న స్థితిలో, నిపుణుల పర్యవేక్షణ లేకుండా రిపేర్లు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. రాష్ట్రపతి, ప్రధాని సహా పెద్దలంతా ఈ ప్రమాదం మీద కూడా ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ ప్రకటించారు. బాధిత కుటుంబీలకు సానుభూతి తెలియచేశారు. ప్రమాదం జరిగిన తరువాత మనదేశంలో సకల వ్యవస్థలూ స్పందించే తీరు, వేగం ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది. ఏకంగా పదిపోలీసు బృందాలు, మూడు రాష్ట్రాలను జల్లెడపట్టి, రాజస్థాన్‌లో దాక్కున్న ఈ భవనం యజమానిని ఢిల్లీ లాక్కొచ్చాయి. ఆయన సహా కొందరు కుటుంబీలను సైతం అరెస్టుచేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందిస్తూ మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ సహా ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) అధికారులు సస్పెండ్ అయ్యారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై ఇకపై 'జీరో టాలరెన్స్' విధానం అమలవుతుందట. అంతేనా? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా ఉండేందుకు ఢిల్లీలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాలకు స్ట్రక్చరల్ ఆడిట్ తప్పనిసరి చేస్తున్నట్లు కూడా ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. హాస్టల్ భవనాల నిర్మాణవేగాన్ని పెంచవలసిందిగా తమ అనుబంధ కళాశాలలకు ఢిల్లీ యూనివర్సిటీ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ హైకోర్టు కూడా ఈ ప్రమాదఘటనపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతూ, నగరంలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాల్లో విద్యార్థుల భద్రత మీద వారంలోగా నివేదిక ఇవ్వాలని కేంద్రానికీ, ఢిల్లీ ప్రభుత్వానికీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కూడా బీజేపీ అధీనంలోనే ఉన్నందున ఈ ఘటనను ట్రిపుల్ ఇంజన్ సర్కారు వైఫల్యంగా కాంగ్రెస్ అభివర్ణిస్తోంది. ఢిల్లీ పీజీ హాస్టల్ వ్యాపారం అంతా బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల అధీనంలో నడుస్తోందని ఆప్ విమర్శిస్తోంది. ఇటువంటి ఘోరాలు జరగ్గానే వ్యక్తులు, వ్యవస్థలు ఎలా ఉలిక్కిపడతాయో గతంలోనూ చూసిందే. ఎంతటివారినైనా వదిలేది లేదని నాయకులు హామీ ఇవ్వడం నుంచి, న్యాయస్థానాలు వాపోవడం వరకూ అంతా వింటున్నదీ కంటున్నదే. ఢిల్లీ 'ప్రమాదాల' జాబితాలోకి ఇప్పుడు సత్యనికేతన్ ఘటన కొత్తగా వచ్చిచేరింది అంతే. దీనికిముందు ఒక హాస్టల్ భవనం మునిగిపోవడం నుంచి, ఒక గెస్ట్‌హౌస్ తగలబడిపోవడం వరకూ అనేకం చూశాం. ఆరు గదులకు అనుమతి తీసుకొని, పాతిక గదుల్లో జనాన్ని నింపి, బేస్‌మెంట్లో రెస్టారెంట్ నిర్వహించిన కారణంగా, ఆ ఐదంతస్తుల భవనం అగ్నికి ఆహుతై విదేశీయులతో సహా పలువురు విద్యార్థులు సైతం ప్రాణాలు పోగొట్టుకున్న మాలవీయనగర్ విషాదం మూడునెలల క్రితమే జరిగింది. దానికి సరిగ్గా మూడురోజుల ముందే, దక్షిణ ఢిల్లీలోని సాకేత్ మెట్రోస్టేషన్ సమీపంలోని భవనం కూలి పలువురు విద్యార్థులు మరణించారు. వీరంతా పొరుగున ఉన్న కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ ఈ హాస్టల్‌లో ఉంటున్నవారు. రాకపోకలకు ఒకేమార్గం ఉన్న ఈ భవనం ఎత్తును అక్రమంగా పెంచుతున్నారని విద్యార్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఒకపక్క పైన బరువు పెంచి, మరోవైపు బేస్‌మెంట్‌లో సంప్ విస్తరణకోసం జరిపిన తవ్వకాలు దాని పునాదినే బలహీనపరచాయి. ఢిల్లీలో గత మూడేళ్ళలో వెయ్యికి పైగా భవనాలు వివిధ కారణాలవల్ల కూలినట్టు నివేదికలు చెబుతున్నాయి. విషాదం జరిగిన ప్రతీసారి ప్రభుత్వం ఏవో చర్యలు ప్రకటిస్తుంది, ఎవరినీ క్షమించేది లేదని, రక్షించేది ఉండదని అంటుంది. భద్రమైన భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తుంది. కానీ, మరో విషాదం జరిగేవరకూ ఊపిరిబిగబట్టి ఎదురుచూడటం వినా జనం చేయగలిగిందేమీ లేకపోతోంది. భద్రంగా లేని భవనాలు, అక్రమ నిర్మాణాలు, చట్టవిరుద్ధ వ్యాపారాలతో ఢిల్లీ ఒక్కటే కాదు, దేశంలోని నగరాలన్నీ వెలుగుతున్నాయి. దీనిని పర్యవేక్షణ లోపంగా చూడటం కంటే, మొత్తం నియంత్రణ వ్యవస్థ కుప్పకూలిందనడం సమంజసం. అవినీతి ఆకాశాన్ని అంటుతున్నదని, జవాబుదారీతనం మటుమాయమైందనీ ఈ విషాద ఘటనలు తెలియచెబుతాయి.

# ప్రజల మనిషి కాళోజీ జయంతి

## సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవం


కాళోజీ తన పాఠశాల విద్యార్థి ధ నుంచి కవిత్వం రాయడం మొదలు పెట్టాడు. ఆయన కవిత్వం 1931లోనే ప్రచురించబడింది. భగత్ సింగ్‌ను రితీయడాన్ని వ్యతిరేకిస్తూ రాసిన కవిత్వమది. అప్పటి నుంచి అన్యాయానికి వ్యతిరేకంగా అతని కలం స్పందించింది. కత్తికంటే కలం గొప్పదని భావించాడు. కవితనే ఆయుధంగా సంధించాడు. విద్యార్థి దశలో నాటి దేశ కల పరిస్థితులు, రాజకీయాలు కాళోజీని ఎంతగానో ప్రభావితం చేసాయి. ఆంగ్లేయుల వలస పాలన నుంచి విముక్తి పొందాలనీ యావత్ భారత ప్రజలు పోరాడారు. స్వతంత్ర పోరాట జ్వాలలు మిన్నంటుతున్నాయి. సహజంగానే చైతన్యవంతుడైన కాళోజీ సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించాడు. అటు ఆంగ్లేయుల వలస పాలనకు, ఇటు ఇక్కడి హైదరాబాద్ స్టేట్‌లోని నిజాం రాజు నిరంకుశ పాశవిక విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకత్వంలో స్వతంత్ర సమరాన్ని రగిలించి కాళోజీ ఇలాంటి ఉద్యమ సంస్థలతో అనుబంధం ఏర్పరచుకున్నాడు. ఆనాటి జాతీయోద్యమ నాయకులు స్వామి రామానంద తీర్థ మాడపాటి హన్మంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు వంటి వారితో కలిసి అనేక ఉద్యమాల్లో కాళోజీ పాల్గొన్నాడు, విద్యార్థి దశలో పి.వి. నరసింహారావు కాళోజీ అనుయాయులే విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేదాజ్ఞలను లెక్కచేయకుండా వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపక ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. కాళోజీ తన కవి తలన్నింటికీ "నాగొడవ" అని ఒకే పేరు పెట్టడం విశేషం 1953లో అలంపురంలో కాళోజీ మొదటి కవిత సంకలనం నా గొడవను ఆవిష్కరించిన శ్రీ శ్రీ ఆయనను నిఖిలాంధ్ర కవిగా ప్రశంసించాడు. తెలియక ప్రేమ తెలిసి ద్వేషము, ఎన్నక కథ, రెండు గింజలు వంటి కథలు సామాజిక రాజకీయ చైతన్యం కలిగించేవే. అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు అన్న రుషి కాళోజీ నా భారతదేశ చరిత్ర జీవనగీత వంటి అనువాదాలు చేశారు. కాళోజీ భాషావాదం ఎవని వాడుక భాష వాడు రాయాలె ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని మనమనుకొనుడు, మనలను మనం తక్కువ చేసుకున్నట్లే. ఈ బానిస భావన పోవాలె. నేనెన్నోసార్లు చెప్పిన, భాష రెండు తీర్లు, ఒకటి బడి పలుకుల భాష రెండోది పలుకుబడుల భాష, పలుకు బడుల భాషగావాలె అంటూ తన కవితల్ని హోరెత్తించాడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ1945లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వితీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవి. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయతినంచినందుకు ఆయనను ఆనాటి నిజాం ప్రభుత్వం నగర బహిష్కరణ శిక్ష విధించింది. ఆనాడు ఉద్యమం ఊరూరా ఉధృతమైంది. ప్రజలు సాయుధులై నిజాం సైన్యాలను రజాకార్ల మూకలను ఎదుర్కొని చెండాడారు. 1939-43ల మధ్య రెండుసార్లు జైలుకు పోవాల్సి వచ్చింది. ఒకసారి వరంగల్ జైలులో కాపలా కాస్తున్న పోలీస ఉద్యమకారులను కల్చినా పాపం లేదన్నప్పుడు జైల్లో ఉన్న కాళోజీ ముందు కెళ్లి, దమ్ముంటే కాల్చు అని రొమ్ము విరిచి చూపించాడట. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురై విద్యను కోల్పోతున్న తరుణంలో వారిని నాగపూరు విశ్వవిద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర మరువ లేనిది. అన్ని రంగాల్లో ఆధిపత్య వాదాన్ని అంతం చేసి స్వేచ్ఛను పంచేందుకు అనుక్షణం ఆయన తపించాడు. 1914 సెప్టెంబర్ 9న జన్మించిన కాళోజీ ప్రజా ఉద్యమాలే ఉద్యమ ఊపిరిగా అలుపెరుగని యోధుడిలా జీవిత యాత్రను సాగించారు కాళోజీ మానవతా వాది. మార్గదర్శకుడు 2002 నవంబర్ 13న కాళోజీ తుది శ్వాస విడిచాడు.





కొలనుపాక కుమారస్వామి, వరంగల్.
సెల్: 9963720669

# చట్టసభల గుమ్మంలో ప్రజాస్వామ్య ద్రోహం



ప్రజాస్వామ్యానికి దేవాలయాలుగా, కోట్లాది మంది ప్రజల ఆశాజ్యోతులుగా వెలుగొందే చట్టసభల ప్రాంగణం నేడు అధికారమదంతో కూడిన పోలీసు దౌర్జన్యాలకు వేదికగా మారడం సమకాలీన రాజకీయ చరిత్రలో అత్యంత అసహ్యకరమైన, లజ్జాకరమైన అధ్యాయం. శాసనసభ ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన అనాగరిక, దురహంకారపూరిత తీరు రాజ్యాంగ స్ఫూర్తిని నిలువునా దహించివేసింది. ప్రజల గొంతుకగా అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల జుట్టు పట్టుకుని లాగడం, గొంతు నులమడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చీరలు లాగుతూ వ్యవహరించడం ఏ రకమైన పాలనకు సంకేతం? ఇది కేవలం కొందరు నేతలకు జరిగిన పరాభవం కాదు; ఇది దేశంలోని మొత్తం మహిళా సమాజానికి, రాజ్యాంగ వ్యవస్థలకు జరిగిన పూడ్చలేని గాయం. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలుపడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిలదీయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రభుత్వ వైఫల్యాలు, పనితీరుపై ప్రజాప్రతినిధులు శాసనసభకు వచ్చి నిరసనను వ్యక్తం చేయడం అనాదిగా వస్తున్న ప్రజాస్వామ్య సంప్రదాయం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు శాసనసభకు చేరుకున్న మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులమైన నాపై (పి. సబితా ఇంద్రారెడ్డి), సునీతా లక్ష్మారెడ్డితోపాటు ఇతర మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రదర్శించిన నిర్బంధ వైఖరి శాంతిభద్రతల పరిరక్షణ కాదు; అది కేవలం అధికారపక్ష అణచివేత ధోరణి. శాసనసభ ముంగిట నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, భౌతిక దాడులకు పూనుకోవడం రాజ్యాంగబద్ధమైన పాలన స్థానే పోలీసు రాజ్యాన్ని ప్రతిష్ఠించే కుట్రలా కనిపిస్తున్నది. 'ప్రజాపాలన' అనే పదబంధాన్ని ఊతపదంగా వాడుకొనే ప్రస్తుత పాలకుల అసలు రంగు ఈ ఘటనతో పూర్తిగా బయటపడింది. ఈ ఘోర కలికి కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయిలో మాట్లాడే నీతులకు, రాష్ట్ర స్థాయిలో వారు అనుసరిస్తున్న అణచివేత చర్యలకు ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నల్లచొక్కాలు ధరించి, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపినప్పుడు అది ప్రజాస్వామ్య పరిరక్షణగా, రాజ్యాంగ హక్కుగా ఊదరగొట్టిన ఆ పార్టీ నాయకత్వం, నేడు తెలంగాణ అసెంబ్లీ వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్ట్‌లతో అసెంబ్లీకి వస్తే పోలీసులతో దాడి చేయించడంలో ఉన్న ఔచిత్యం ఏంది? జాతీయ స్థాయిలో ఒక రాజ్యాంగ సూత్రం, స్వయంగా అధికారంలో ఉన్న రాష్ట్రంలో మరొక అణచివేత సూత్రం చెల్లుబాటు అవుతుందా? రాహుల్ నిరసన తెలిపితే అది పోరాటం, తెలంగాణలో మహిళా ప్రజాప్రతినిధులు నిరసన తెలిపితే నేరమా? ఈ దగాకోరు ద్వంద్వవిధానాన్ని ప్రజాస్వామ్యవాదులు ఏవిధంగా సమర్థిస్తారు? భారత రాజకీయ చరిత్రను తిరగేస్తే, చట్టసభల లోపల లేదా వెలుపల మహిళా నేతలపై భౌతికదాడులకు దిగిన ప్రతి సందర్భంలోనూ పాలకులు ప్రజల గ్రహపాటుకు గురయ్యారనేది స్పష్టమవుతున్నది. తమిళనాడు శాసనసభలో నాటి ప్రతిపక్ష నేత జయలలితపై అసెంబ్లీ ప్రాంగణంలో దాడి చేసి, ఆమె చీరను లాగి అవమానించినప్పుడు, కన్నీళ్లతో బయటకువచ్చిన ఆమె మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడుతానని శపథం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ రాష్ట్ర రాజకీయ చిత్రాన్నే మార్చేశాయి. 1995లో ఉత్తరప్రదేశ్‌లో మాయావతిపై జరిగిన భౌతికదాడి నాటి ప్రభుత్వ పతనానికి నాంది పలికింది. కేరళ శాసనసభలో 2015 బడ్జెట్ సమావేశాల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన అణచివేత చర్యలు తీవ్ర వ్యతిరేకతకు దారితీశాయి. సింగూర్ ఉద్యమ సమయంలో టీఎంసీ అగ్ర నేత మమతా బెనర్జీని పోలీసులు ఈడ్చిపారేసిన దృశ్యాలు వామపక్ష ప్రభుత్వ శాశ్వత పతనానికి బాటలు వేశాయి. చరిత్ర నేర్పిన ఈ గుణపాఠాలను కాంగ్రెస్ పాలకులకు గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నది. అధికారమదంతో మహిళా నేతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ఏ ప్రభుత్వం పూనుకున్నా, కాలక్రమంలో వారు తీవ్ర రాజకీయ పరిణామాలను ఎదుర్కోక తప్పదు. ఒకవైపు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాలు తెస్తున్నామని గొప్పలు చెప్పుకొనే రాజకీయ వ్యవస్థ, మరోవైపు ఎన్నుకైన మహిళా ప్రజాప్రతినిధుల మీదనే ఈ రకమైన తీవ్ర భౌతికదాడులకు దిగడం హేయమైన చర్య. మాజీ మంత్రులుగా, శాసనసభ్యులుగా సమాజంలో ఎంతో గౌరవం ఉన్న నాకు (సబితా ఇంద్రారెడ్డి), సునీతాలక్ష్మారెడ్డి వంటి సీనియర్ నాయకులకే రక్షణ లేకపోతే, రేపు రాజకీయాల్లోకి రావాలనుకునే సాధారణ మహిళలకు ఈ వ్యవస్థ ఎలాంటి సంకేతాన్ని ఇస్తుంది?. ద్రౌపది వస్త్రాపహరణం సభామధ్యలో జరిగినప్పుడు మౌనంగా ఉన్న రాజ్యాంగ వ్యవస్థలు ఏ విధంగా కూలిపోయాయో మహాభారతం చెప్పింది. నేడు శాసనసభ గుమ్మం వద్ద జరిగిన ఈ ఘోరం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన మహమ్మారే. ప్రస్తుత ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. పోలీసు బలగాలను ఉపయోగించి ప్రతిపక్షాలను, ప్రత్యేకించి మహిళా నేతలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ద్వారా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు. మహిళా శాసనసభ్యుల చీరలు లాగిన, గొంతు నొక్కిన, జుట్టు పట్టుకుని లాగిన పోలీసు అధికారులను తక్షణమే గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించి, వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా? లేదా, ఈ వికృతచేష్టలకు తామే స్వయంగా ఆదేశాలిచ్చామని, పోలీసుల 'అతి' వెనుక ప్రభుత్వ హస్తం ఉన్నదని బహిరంగంగా ఒప్పుకొంటారా? తాత్కాలికంగా పోలీసు బలగాల వెనుక దాక్కొని, భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షం నోళ్లు మూయించి పాలకులకు పైశాచిక ఆనందం కలుగవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదనే సత్యాన్ని విస్మరించవద్దు. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలోకి రాక తప్పదు. చట్టసభల గౌరవాన్ని, నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును, మహిళా ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని కాలరాస్తే, రేపు ప్రజ ల ఆధ్వర్యంలో ఎదురయ్యే నిరసన మంటలకు ప్రభుత్వం బలికావడం ఖాయం! ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, తన ప్రజాస్వామ్య వ్యతిరేక తీరును మార్చుకోవాలని హెచ్చరిస్తున్నాం.

# శేఖర్ బస్తీలో విద్యుత్ సమస్యలపై డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ పరిశీలన-- పరిష్కరిస్తానని హామీ





**రామంతాపూర్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):**

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని శేఖర్ బస్తీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ విద్యుత్ శాఖ ఏఈ మేఘనాథ్ తో కలిసి మంగళవారం బస్తీలో పర్యటించారు. శేఖర్ బస్తీలో విద్యుత్‌కు సంబంధించిన 3-ఫేజ్ లైన్‌తో పాటు విద్యుత్ స్తంభాల కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం అందుకున్న శ్రీకాంత్ యాదవ్ వెంటనే స్పందించి, విద్యుత్ శాఖ అధికారితో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, విద్యుత్ లైన్లు, పోల్స్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను శ్రీకాంత్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, అవసరమైన చోట కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయనతో చర్చించి శేఖర్ బస్తీలో కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయిస్తామని శ్రీకాంత్ యాదవ్ హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారితో కలిసి బస్తీలో పర్యటించడం పట్ల కాలనీ వాసులు శ్రీకాంత్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పర్యటనలో కాలనీ వాసులు ప్రవీణ్, షెర్వానాద్, మనోహర్ యాదవ్, శ్రీకాంత్, మహేష్, అంబికా, రూప, విజయ, జై విజయ స్వరూప్, శాంతమ్మ, శ్రీధర్, సచిన్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం:

**- రేవంత్ తీరుపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం**

**జవహర్ నగర్ సెప్టెంబర్ 8: (వార్త ప్రతినిధి)**





మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరుకోవడం అత్యంత దారుణమని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఎర్రవల్లి వైపు వెళ్తున్న హరీష్ రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాయకులను పోలీసులు హకీంపేట వద్ద అదుపులోకి తీసుకుని, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాజీ మంత్రి హరీష్ రావు

**హీనమైన రాజకీయాలు:** షా దనగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ సీఎం కేసీఆర్ చావును కోరుకోవడం సంస్కారహీనమని దుయ్యబట్టారు. ఈ వ్యాఖ్యల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు.

సభ్యత్వ రద్దు డిమాండ్: కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీర్లపల్లి శంకర్ శాసనసభ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కౌరవుల గతే పడుతుంది: ప్రతిపక్షాలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్న రేవంత్ ప్రభుత్వానికి, గతంలో కౌరవులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

సభ డైవర్షన్ నాటకాలు: గత రెండు రోజులుగా శాసనసభలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లపై చర్చ జరగకుండా ప్రభుత్వం సభను ఉద్దేశపూర్వకంగా డైవర్ట్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ఎమ్మెల్యేలపై దాడి: అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని, పోలీసుల వైఖరిని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు.

ప్రజా క్షేత్రంలో పోరాటం: ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని, ప్రజా సమస్యలపై నిరంతరం కొట్లాడతామని స్పష్టం చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో హరీష్ రావుతో పాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు,జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య,కొండల్, జలంధర్ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**- పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు**

**జవహర్‌నగర్ సెప్టెంబర్ 8:(వార్త ప్రతినిధి)**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని, అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని జవహర్‌నగర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జవహర్‌నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్‌కు చెందిన మాదిగలు, మాదిగ ఉపకులాలు, దళితులు, బహుజనులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గడిచిన 32 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ మరియు సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ సాగించిన పోరాట చరిత్రను, ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు స్మరించుకుంటూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు కాప్రా మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొత్త నరేష్ మాదిగ, బూడిద వెంకటేష్, గండి నర్సయ్య, చెన్నాపురం యాదయ్య, మరాఠీ బాబు, కొమ్ము ఇలా కాంత్, గుర్రం కొమురయ్య, గుర్రం లక్ష్మయ్య, యాతల లక్ష్మణ్, అంబాల ఎల్లయ్య, మోతె వెంకటేష్, మోత మల్లేష్, చెన్నాపురం ప్రభాకర్, శ్రీనివాస్, బాలరాజు, నరసింహ, రవి, సింగపురం యాకయ్య, గండి యాదగిరి.

మాజీ ప్రజాప్రతినిధులు: మాజీ ఎంపీటీసీ సభ్యులు మొగిలిపాక పరశురామ్, మాజీ వార్డు సభ్యులు కందుల కృష్ణ, కొయ్యడ ఐలయ్య. మాదిగ, మాదిగ ఉపకుల నాయకులతో పాటు కులాలకు అతీతంగా వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఈ నెల 10న చలో హైదరాబాదు మహా ధర్నాను విజయవంతం చేయండి

**టా.ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ పిలుపు**

**మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 08**

ఈ నెల 10న చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమానికి టీజీ ఈ జేఏసీ పిలుపు ఇచ్చిన సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో టా ప్ర హుజురాబాద్ యూనిట్ అధ్యక్షుడు భారత ప్రభాకర్ అధ్యక్షతన సన్నాహక సమావేశము నిర్వహించనైనది. ఇట్టి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టాప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నూతన పి ఆర్ సి జూలై 2023 నుండి అమలు,పెండింగ్ డి ఏ ల విడుదల,సిపిఎస్ రద్దు ఓపిఎస్ అమలు,పెన్షనర్ల పెండింగ్ బిల్లుల మంజూరి,నూతన ఈ హెచ్ ఎస్ విధానము ఏర్పాటుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధించి టి జి ఈ జెఎసి ఈ నెల 10న తలపెట్టిన చలో హైదరాబాదు మహాధర్నాను విజయవంతం చేయుటలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరి నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారం కొరకు గత నెల 27న అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ,రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కదిలి రాకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండడం సరైన పద్ధతి కాదని ఆందోళన వ్యక్త పరచినారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ సమస్యల పరిష్కారం కొరకు స్పందించాలని లేనిచో తర్వాత జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించినారు. టీజీ ఈ జెఎసి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 10న హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమానికి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై ఈ మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసినారు. ఇట్టి సమావేశంలో టా ప్ర హుజురాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, టీ కనుకయ్య, బి వెంకటయ్య,డి హరి కిషన్, ఎం మొగిలయ్య, సిహెచ్ మల్లారెడ్డి, జి సాంబయ్య, జి బుచ్చి రాజం, శబ్ద ప్రకాష్, రవీందర్ రెడ్డి,జి గంగయ్య, జి స్వామి రెడ్డి, యు రాజేశం, ఎన్ రాజిరెడ్డి, సిహెచ్ సమ్మిరెడ్డి, సురేష్ బాబు,పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కన్వీనర్‌గా చెల్లోజు ఎల్లాచారి



**వెంకట్ రెడ్డి నగర్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కన్వీనర్‌గా చెల్లోజు ఎల్లాచారి నియమితులయ్యారు. రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిండేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్‌లు ఎల్లాచారిని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కన్వీనర్‌గా నియమించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లాచారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సమితి పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజలు, భక్తులు, యువతను భాగస్వామ్యం చేస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చింతకింది ప్రవీణ్, వార్ల బాలరాజు, రాపోలు సాయినాథ్, కొండేరు ప్రవంతి తదితర సమితి నాయకులు పాల్గొని ఎల్లాచారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉత్సాహంగా ఎస్ జి ఎఫ్ క్రీడలు



**చిట్యాల సెప్టెంబర్ 08 మీ వార్త**

చిట్యాల మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఉత్సాహంగా జరిగాయని క్రీడల చైర్మన్ మండల విద్యాధికారి కొడేపాక రఘుపతి తెలిపారు క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక వికాసానికి తోడ్పడుతాయని ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకుని దాని దిశగా కృషి చేయాలని మాట్లాడడం జరిగింది క్రీడలు దేశభక్తిని పెంపొందిస్తాయని చిట్యాల ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడారు చిట్యాల మండల స్థాయి చిట్యాల మండల స్థాయి క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ సూదం సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో ఉన్న వివిధ పాఠశాలల నుండి 480 మంది క్రీడాకారులు కబడ్డీ కోకో వాలీబాల్ క్రీడలలో పాల్గొన్నారు అని ఇందులో 120 మందిని జిల్లా స్థాయి క్రీడలకు పంపిస్తామని తెలిపారు క్రీడల కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు వేల్పుల రాజు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, బొమ్మ రాజమౌళి. పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు టి స్వరూపారాణి .బండి ప్రసాద్. నూకల లింగయ్య .గాజర్ల శ్రీనివాస్ .ఉమా. వెన్నెల .శారద. అశో.క్ చెట్టి భాస్కర్. నరేష్. సంగా రఘుపతి .తదితరులు పాల్గొన్నారు

# చిల్కానగర్ డివిజన్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షులుగా జేర్రిపోతుల బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల అనిల్ కుమార్**





**చిలుకా నగర్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):**

ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చిల్కానగర్ డివిజన్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరవాక అంజి మాదిగ అధ్యక్షత వహించగా మేడ్చల్--మల్కాజిగిరి మాజీ అధ్యక్షులు ప్రణయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అంతగల్ల అశోక్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు శామీర్‌పేట చంద్రయ్య, రాయగిరి జ్ఞానేశ్వర్, గండి నర్సింగరావు, పలమాకుల పరుశరాములు, పల్లె నర్సింగరావు తదితరుల సమన్వయంతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ అధ్యక్షులుగా జేర్రిపోతుల బాలకిషన్
ఉపాధ్యక్షులుగా గంధమల్ల నరేష్,
ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల అనిల్ కుమార్,
అధికార ప్రతినిధిగా పొట్ట వినోద్ కుమార్,
సహాయ కార్యదర్శులుగా ఎర్ర రాజు, పుట్ట రాజు
కోశాధికారిగా పానుగంటి నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, సంస్థ ఆశయాల సాధనకు నూతన కమిటీ కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరి యాదగిరితో పాటు నియోజకవర్గ నాయకులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో జేయంజే పాఠశాలలో ఎస్జిఎఫ్ క్రీడా పోటీలు.

**మనోహరాబాద్ సెప్టెంబర్ 8 మన మీ వార్త ప్రతినిధి.**



మండల పరిధిలో జేఎంజే పాఠశాలలో ఎస్జిఎఫ్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటస్వామి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అవకాశం ఉన్నట్లు ఆయన సూచించారు. అండర్-14 అండర్-17 విభాగాల్లో బాలురకు, బాలికలకు కోకో,కబడ్డీ, వాలీబాల్, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వెల్లడించారు

## కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నాయకులు సీఐకి ఫిర్యాదు

చిట్యాల సెప్టెంబర్ 08 మీ వార్తా



చిట్యాల: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ను బహిరంగంగా మరణించాలి అంటూ షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు చిట్యాల సీఐ సతీష్ కు ఫిర్యాదు అందజేశారు. సంబంధిత వ్యాఖ్యలపై విచారణ చేపట్టి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొడారి రమేష్, పర్లపల్లి సర్పంచ్ జోరుక సదయ్య, చిట్యాల మండల యూత్ అధ్యక్షుడు తౌటం నవీన్, సీనియర్ నాయకులు చిలుముల రమణాచారి, పాంద్రాల వీరస్వామి. పాల్గొన్నారు.

## మాస్ కమ్యూనికేషన్‌లో ప్రాన్నుతకు రెండు స్వర్ణ పతకాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):



ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగంలో దాసి ప్రాన్నుత రెండు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ ఘనతతో ఆమె కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పెద్దపల్లి జిల్లా కూనారం గ్రామానికి చెందిన ప్రాన్నుత ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించారు. బెంగళూరు, వరంగల్‌లోని కేంద్రీయ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసిన ఆమె పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో టాపర్‌గా నిలిచారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం (దీూవీఖ)లో గ్రాడ్యుయేషన్‌లోనూ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ పూర్తి చేశారు. ప్రాన్నుత మాజీ భారత వైమానిక దళ అధికారి దాసి ప్రభాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కల్పన దంపతుల కుమార్తె. ప్రభాకర్ భారత వైమానిక దళంలో సేవలందించడంతో పాటు కార్గిల్ యుద్ధంలోనూ పాల్గొన్నారు. దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా పతకం అందుకున్నారు. ప్రాన్నుత రెండు స్వర్ణ పతకాలు సాధించడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణమని తల్లిదండ్రులు తెలిపారు. ఆమె సాధించిన విజయం క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు.

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలి

- అరుంధతీయ బంధు సేవా మండలి మెదక్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి సత్యం.

మెదక్ సెప్టెంబర్ 8 మనమీ వార్త ప్రతినిధి



దళిత స్పీకర్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని,ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని సత్యం అన్నారు.
బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాత మధు తన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, శాసన మండలి నిబంధనల ప్రకారం తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు. ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఘటనపై స్పందించి, ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను ఖండించడంతో పాటు దళిత సమాజానికి, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పెద్దింటి సత్యం డిమాండ్ చేశారు.
శాసన వ్యవస్థ ప్రతిష్టను కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## ఘనంగా శ్రావణమాస బోనాల ఉత్సవాలు

- ముఖ్య అతిథి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి..

పటాన్ చేరు సెప్టెంబర్ 08 మీ వార్త ప్రతినిధి :



పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతీనగర్ డివిజన్ ఫెన్సింగ్ ఏరియాలో శ్రావణమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ విన్నవరం ఆదర్శ్ రెడ్డి గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ యువ నాయకుడు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొటెల కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానిక ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, జైపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అని రంగాలలో మరింత ముందుకు వెళ్లాలి

- అమరావతి జాతీయ మహాసభకు సన్నద్ధం కావాలి
- ఫోర్ కమిటీ చైర్మన్ చౌటిపల్లి విజయ
- ఎమ్మార్పీఎస్ ఎమ్మెమ్మెస్ మహిళా విభాగం జిల్లా సమావేశంలో వెల్లడి

మెదక్ సెప్టెంబర్ 08 మన మీ వార్త ప్రతినిధి :-





మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం సమావేశం జరిగినట్లు మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ అనుబంధ సంఘాల మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి మాదిగ తెలిపారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు వెళ్లి సమానత్వం సాధించాలని వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఇట్టి కార్యక్రమం ఫోర్ కమిటీ చైర్మన్ విజయ మాదిగ ఎంఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు జేపీ లతా మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మాదిగ మెదక్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తప్పెట పుష్ప మాదిగ హాజరైనట్లు వారి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మహిళలకు తమ స్వావలంబన మన కోసం మరింత ముందుకెళ్లడానికి కావలసిన నైపుణ్యాలను వివరించడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా మండలాల గ్రామాల కార్యకర్తలు సమావేశానికి వచ్చి విజయవంతం చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు అమరావతి వేదికగా జరగబోయే జాతీయ సమావేశానికి సన్నద్ధం కావాలని సూచిస్తూ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు .

# కౌశిక్ రెడ్డి రాజీనామాకు సిద్ధమా?...వొడితల ప్రణవ్..






- హుజురాబాద్ నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డి రాజకీయ జీవితానికి పాడే కట్టే రోజు ముందుంది..
- స్పీకర్ పై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు.
- మహిళలంటే గౌరవమున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ..
- దళితులంటే బీఆర్ఎస్,కౌశిక్ రెడ్డి కి చిన్న చూపు..
- కొండంగల్ లో కాదు హుజురాబాద్ లో రాజీనామా చేసి..దమ్ముంటే గెలువు.
- 50 కోట్లు కాదు ఒక్కరూపాయి కూడా దళిత బంధు అకౌంట్ లో కెళ్ళి నిధులు వెనక్కి పోలేదు..
- కౌశిక్ రెడ్డికి సవాల్ విసిరిన ప్రణవ్.స్వీకరణకు సిద్ధమా?
- అసెంబ్లీలో స్పీకర్ కన్నీరు పెట్టడం బాధ కలిగించింది.

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 08



అసెంబ్లీ అంటే దేవాలయమని అలాంటి దేవాలయం ముందు బిఆర్ఎస్ నాయకులు చేసిన ప్రవర్తన సిగ్గుచేటని,దళితులంటే బీఆర్ఎస్ పార్టీకి,కౌశిక్ రెడ్డికి ప్రేమ లేదని,ఎన్నికల ముందు వారి ఓట్ల కోసం కపటప్రేమ చూపెడుతూ వారి సంక్షేమాన్ని అడ్డుకున్న వ్యక్తి కౌశిక్ రెడ్డి అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.మంగళవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ దళిత స్పీకర్ పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో తాతా మధు వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేసి,ఆయన దిష్టి బొమ్మ దగ్ధంచేశారు..స్పీకర్ పై చేసిన వ్యాఖ్యల్లో బిఆర్ఎస్ నాయకులు సీనియర్లు అని చెప్పుకునే నాయకులు,మంత్రులుగా చేసిన వారు ఈ చర్యను ఏ విధంగా సమర్థించుకుంటారో వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని అన్నారు.మహిళల పట్ల గౌరవం కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పోల్చుకునే స్థాయి కౌశిక్ రెడ్డిది కాదని,ఇప్పటికే ఆయన ప్రవర్తన చూసి హుజురాబాద్ ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దళిత బంధు ఆపి, వారి కళ్ళల్లో కన్నీళ్ళు నింపిన వ్యక్తి కౌశిక్ రెడ్డి..**

దళిత బంధు పథకం లబ్ధిదారులకు అందకుండా అడ్డుకున్న వ్యక్తి కౌశిక్ రెడ్డి అని,రెండేళ్లు ఎమ్మెల్సీగా ఉండి,వారికి నిధులు ఇవ్వకుండా ఎన్నికల్లో తమకు ఓటు వేస్తేనే పథకం అందుతుందని ఓట్ల కోసం వారిని వాడుకున్నారని,దళిత బంధు పథకం ఆపి దళితుల కళ్ళల్లో కన్నీళ్ళు నింపిన వ్యక్తి కౌశిక్ రెడ్డి అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి నిధులు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,జిల్లా ఇంచార్జి మంత్రులను కోరితే మా కోరిక మేరకు నిధుల విడుదలకు ఫ్రీజింగ్ ఎత్తి వేశామని మిగతావి కూడా పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని దళితులకు భరోసా కల్పించారు.సోషల్ మీడియాలో రీల్స్ కోసం మాత్రమే చూస్తాడు తప్ప నిజంగా ప్రజల బాగోగుల మీద చిత్త శుద్ధి లేదని అన్నారు.లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందవద్దని దళిత బంధు నిధులు వారి అకౌంట్ లేనే ఉన్నాయని,కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని అన్నారు.

**మహిళలంటే గౌరవమున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ..**

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించామని,ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళ చుట్టే తమ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని స్పీకర్ ను తిట్టినా వెంటనే ఘటనకు సంబంధించి విచారణకు ఆదేశించారని,దళిత స్పీకర్ పై వ్యక్తిగత దూషణకు సంబంధించి బిఆర్ఎస్ ఎలాంటి చర్యలు లేవని ఇదేనా బిఆర్ఎస్ సంస్కారం అని ప్రశ్నించారు.మంత్రి వర్గంలో మంత్రి పదవులు ఇవ్వకుండా వారు ఉంటే ప్రభుత్వం ఏర్పడగానే వారికి మంత్రి పదవులు ఇచ్చి గౌరవించామని అన్నారు.

**1000 రోజుల్లో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందజేశాం..**

గడిచిన 1000 రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి గడపకు సంక్షేమాన్ని అందజేశామని,ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఉచిత బస్ అందజేశమనీ,సన్నబియ్యం,నియోజవర్గంలో 18 వేల నూతన రేషన్ కార్డులు,23 వేల నెంబర్ ఆడిషన్స్ రేషన్ కార్డులు అందజేశామని,ఇందిరమ్మ ఇళ్లతో నియోజకవర్గంలో 3500 ఇళ్లు ఇచ్చామని,31,158 వేల రైతులకు 243 కోట్లతో 2 లక్షల లోపు రుణమాఫీ చేశామని అన్నారు.రైతు భరోసా ద్వారా 73 వేల రైతులకు 71 కోట్ల నిధులు హుజురాబాద్,రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో 9 వేల కోట్లు అందజేశామని అన్నారు.అనేక సంక్షేమ పథాలకు ప్రజలు చెరవేషామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- శాంతిభద్రతలు, విద్యుత్ ప్రజా భద్రతపై సమావేశం
- మండపాల వద్ద సీసీ కెమెరాలు, వాలంటీర్ల పర్యవేక్షణ తప్పనిసరి
- లౌడ్ స్పీకర్ తో భక్తి గీతాలను వినియోగించాలి...
- డీజే ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు..
- గుమ్మడిదల పోలీస్ సిబ్బంది స్థానికులకు హెచ్చరిక....

పటాన్ చేరు సెప్టెంబర్ 08 మీ వార్త ప్రతినిధి:




గుమ్మడిదల మండల పరిధిలో రాబోయే వినాయక చవితి మరియు గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులతో గుమ్మడిదల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన నుండి నిమజ్జన కార్యక్రమం వరకు నిర్వాహకులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు మరియు ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులు విపులంగా వివరించారు.ప్రత్యేకంగా విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపుల నిర్వహణ, సౌండ్ సిస్టమ్/డీజే వినియోగానికి సంబంధించిన నిబంధనలు, రహదారులకు అంతరాయం కలగకుండా చూడటం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై నిర్వాహకులకు సూచనలు మరియు సలహాలు అందించారు.గణేష్ ఉత్సవాలను మత సామరస్యం, సోదరభావం మరియు శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖలకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని అధికారులు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో సి ఐ పి జిన్నారం రమణ రెడ్డి, ఎస్ఐపి గుమ్మడిదల అరుణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీ దశరథ్ , ఎలక్ట్రికల్ ఏఇ పాల్గొని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మరియు యువజన సంఘాల ప్రతినిధులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా మరియు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ మరియు సంబంధిత ప్రభుత్వ శాఖలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## IFAT India 2026లో పాల్గొననున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న 13వ IFAT (ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫర్ వేస్ట్ వాటర్ టెక్నాలజీ) ఇండియా 2026లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న పాల్గొననున్నారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన మున్సిపల్ కమిషనర్లు, సీనియర్ అధికారులతో కూడిన ప్రతినిధి బృందంలో భాగంగా కమిషనర్ వెంకన్న ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. పట్టణ నీటి నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, బయోగ్యాస్, ఈ-వేస్ట్ తదితర ఆధునిక పర్యావరణ సాంకేతికతలపై నిర్వహించే ప్రదర్శనలు, సాంకేతిక సమావేశాలు, నిపుణులతో చర్చలు, జ్ఞాన మార్పిడి కార్యక్రమాల్లో కమిషనర్ వెంకన్న పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు, ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి వరంగల్ నగరంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఉపయోగపడనున్నాయి.

## దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన

పటాన్ చేరు సెప్టెంబర్ 08 మీ వార్త ప్రతినిధి :

– బీఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి: కాట సుధా శ్రీనివాస్ గౌడ్..



దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకారపూరిత, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)




ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు ప్రతిపాదనలను ఖండిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి బయలుదేరిన కాసిపేట మండల పోరం కోశాధికారి, ఉప సర్పంచ్ జంజిరాల సందీప్, మాడావి రమేష్‌లను దేవాపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయవద్దని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి పరామర్శ



కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)

మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిలో సోమవారం రెండో షిఫ్టులో నలుగురు కార్మికులకు ప్రమాదం జరగడం బాధాకరమని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ప్రమాదంలో మిస్‌ఫైర్ కారణంగా గాయపడిన కోల్‌కట్టర్ గోగుల రమేష్ కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి రమేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రమేష్ సతీమణితో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యానికి సంబంధించి ఏ అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, సెంట్రల్ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, మందమర్రి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్, ఇప్పకాయల లింగయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, రత్నం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో కూడిన అభివృద్ధే లక్ష్యం

– పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను, బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
ముందుగా 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, ప్రకాశరెడ్డిపేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్‌లోని పోచమ్మ మైదాన్, 21వ డివిజన్ ఎల్బీనగర్, 36వ డివిజన్‌లోని చింతల్, 38వ డివిజన్‌లోని ఖిలా వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.
ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణ పనుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు. పోచమ్మ మైదాన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పనుల పూర్తికి ముందు అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ



కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)

మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్‌లను సర్పంచ్ సీడం రాందాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు అందిస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామస్థాయిలో విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ రాథోడ్, వార్డు సభ్యులు సంద్ర భీమయ్య, అరుణ్, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నేపథ్యంలో బైండోవర్

కాసిపేట, సెప్టెంబరు 8:(మన మీ వార్త మండల ప్రతినిధి)




గణేష్ ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు దేవాపూర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రౌడీషీటర్ పొట్ట శ్రీనివాసరావును ముందస్తుగా బైండోవర్ చేశారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజా శాంతికి విఘాతం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బైండోవర్ చేసిన శ్రీనివాసరావు శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని పోలీసులు హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని దేవాపూర్ ఎస్ఐ ఏ. గంగారం కోరారు.

# రైతుల బకాయిలు చెల్లించాలని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతి

చిట్యాల సెప్టెంబర్08 మీ వార్త



ఆరుగాల పండించిన మక్కజొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ఇప్పటివరకు డబ్బులు చెల్లించకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మంగళవారం రోజున జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు

రైతులు తమ పంటను విక్రయించి రోజుల తరబడి ఎదురుచూస్తున్నప్పటికీ, వారికి రావాల్సిన డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి పంట సాగు చేసిన రైతులు, పంట అమ్మిన డబ్బుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో చెల్లింపుల్లో జాప్యం చేయడం వల్ల మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

రైతు పండించిన పంటను కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు చెల్లించడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, రైతుల సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కావున జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, మక్కజొన్న విక్రయించిన రైతులందరికీ పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా రైతులకు చెల్లించాల్సిన డబ్బుల విషయంలో నిర్లక్ష్యం వహించిన, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసిన లేదా విధుల్లో అలసత్వం ప్రదర్శించిన సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల సహనాన్ని పరీక్షించకుండా ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించాలి. రైతులకు రావాల్సిన ప్రతి రూపాయి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతుల హక్కుల కోసం మరింత పెద్ద ఎత్తున పోరాటం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# -కాంగ్రెస్ ప్రభుత్వానికి కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజా

వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



-హసన్పర్తిలో బీజేపీ 'మహాధర్నా' -- ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని డిమాండ్.
-అధికారులకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నిసార్లు చెప్పినా చలనమేది... ?
-ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకుంటే ఉధృతస్థాయిలో ధర్నాలు చేస్తాం:- కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ హెచ్చరిక.


విద్యార్థులు, ఉద్యోగులు, మరియు నిత్యం ప్రయాణించే ప్రజల సౌకర్యార్థం హసన్పర్తి బస్టాండ్ లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపాలని డిమాండ్ చేస్తూ ఈరోజు బీజేపీ రాష్ట్ర నాయకులు గురుమూర్తి శివకుమార్ మరియు హసన్పర్తి మండల అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు.
ఈధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై మాట్లాడుతూ... హసన్పర్తి మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడ ఆగకపోవడం వల్ల వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు ఆర్టీసీ డిపో మేనేజర్, రీజినల్ మేనేజర్ లకు వినతిపత్రాలు సమర్పించామని గుర్తుచేశారు.
-అంతేకాకుండా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి కూడా పలుమార్లు సమస్యను వివరించి విజ్ఞప్తులు చేసినప్పటికీ, అధికారుల్లో గానీ, ప్రభుత్వంలో గానీ ఎలాంటి చలనం లేకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.
-ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ, ప్రజల కనీస అవసరాలు మరియు సమస్యల మీద లేదని విమర్శించారు.
ప్రజాసమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తక్షణమే హసన్పర్తి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.
ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, జనగాం జిల్లా కిసాన్ మోర్చా ఇన్చార్జి ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర కౌన్సెల్ మెంబర్ రాంచందర్ రెడ్డి, పెంబర్తి సర్పంచ్ కుమారస్వామి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల బిజెపి నాయకులు సారంగపాణి,పిట్టల కుమారస్వామి, చకీలం రాజేశ్వరరావు, పబ్బా ఉమాదేవి, పెద్దమ్మ శ్రీనివాసు, ప్రభాకర్ రెడ్డి మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హన్మకొండ అక్టోబర్ 4న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు

**– హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రెడ్ క్రాస్ ఎన్నికల నిర్వహణపై అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశం



హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి సంబంధించిన ఎన్నికల నిర్వహణ అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇతర అధికారులతో పాటు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ కి సంబంధించిన ఎన్నికల నిర్వహణ గురించిన అంశాలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు.
ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు.
ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ..ఎన్నికలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు . ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాపిరెడ్డి, వెంకటనారాయణ గౌడ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**– హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి






జిల్లాలో రానున్న వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ముందుస్తుగానే సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పౌరసరఫరాలు, డిఆర్డిఏ, వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖ అధికారులతో కలిసి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, పిఎసిఎస్ ల సీఈవోలు, ఏపీఎంలతో సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు, పరికరాలను సెప్టెంబర్ 25లోగా పూర్తిస్థాయిలో సమకూర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు , తేమ కొలిచే మీటర్లు, తదితర పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సన్నరకం ధాన్యం రకాలను గుర్తించి, వాటి కొనుగోలుపై సంబంధిత సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు.

జీపీఎస్ అమర్చిన వాహనాల ద్వారానే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులు లేదా నిర్దేశిత గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు.
కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దాన్యాన్ని సెంటర్ లోనే కొనేవిధంగా పర్యవేక్షించాలని, వాహనాల కదలికలను జిపిఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సీఈవోలు, ఏపీఎంలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు
ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి మహేందర్, డిఆర్డివో మేన శ్రీను, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా సహకార అధికారి మోహన్, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి అనురాధ, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు , పిఎసిఎస్ ల సీఈవోలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్త గొల్లన సతీష్ అకాల మరణం పార్టీకి తీరని లోటు:- -బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.



మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్ అబ్బానికుంట బూత్ అధ్యక్షులు గొల్లన సతీష్ అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సతీష్ మరణవార్త తెలిసిన వెంటనే గంట రవికుమార్ అబ్బానికుంటలోని వారి నివాసానికి చేరుకుని, సతీష్ భౌతిక కాయాన్ని సందర్శించి, పార్టీ కోసం నిరంతరం శ్రమించిన క్రియాశీలక నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, సతీష్ భౌతిక కాయంపై భారతీయ జనతా పార్టీ అధికారిక జెండాను కప్పి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ... సతీష్ క్రమశిక్షణ గల కార్యకర్తగా, బూత్ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ ఎల్లప్పుడూ సతీష్ కుటుంబానికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మోర్చా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బీజేపీ నాయకులు బండి సుజాత, సుర శ్రీను, నగేష్ మరియు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో కాసిపేట అక్షరాస్యత కార్యక్రమానికి గుర్తింపు

**– న్యూఢిల్లీలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో రాష్ట్ర బృందం**

కాసిపేట, సెప్టెంబరు 8:(మన మీ వార్త మండల ప్రతినిధి)



కాసిపేట మండలంలో నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బృందం పాల్గొంది. రాష్ట్రం తరఫున మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో అమలు చేసిన 'ఉల్లాస్', 'వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత', 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాలను బృందం ప్రాతినిధ్యం వహించింది. తెలంగాణలో 'ఉల్లాస్' కార్యక్రమాన్ని 2025లో తొలిసారిగా కాసిపేట మండలంలో అమలు చేశారు. ఇందులో భాగంగా మండలంలో 3,462 మంది నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అక్షరాస్యత నేర్పించేందుకు 283 మంది వాలంటీర్లను నియమించారు. 9, 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల విజయవంతమైన అమలుతో కాసిపేట మండలానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది.న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి వయోజన విద్య రాష్ట్ర అధికారి పురుషోత్తం నాయక్, రంగారెడ్డి డిప్యూటీ డైరెక్టర్ అనిత, రాష్ట్ర సమన్వయకర్త శైలజ, హైదరాబాద్ డైరెక్టర్ మహమ్మద్ నుమాన్, డీఆర్పీ బండ శాంకరి, వాలంటీర్లు రాజేశ్వరి, రజిత, కవిత, అక్షరాస్యత సాధించిన భూమమ్మ, జ్యోతి, సహాయకులు హరిలాల్, రాజు, సింధూర తదితరులు పాల్గొన్నారు.

**నేడు కాసిపేట కార్యక్రమాల ప్రదర్శన**

న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించనున్న మేళాలో వివిధ రాష్ట్రాలు తమ అక్షరాస్యత కార్యక్రమాలపై ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. తెలంగాణ రాష్ట్రం తరఫున కాసిపేట మండలంలో అమలు చేసిన అక్షరాస్యత కార్యక్రమాల విజయాలను మంచిర్యాల జిల్లా బృందం జాతీయస్థాయిలో వివరించనుంది.

## వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు.
విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి.
ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబందిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు.
అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు.
మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు.
మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెద్దనపల్లి నాయకపుగూడలో చిరుత కలకలం

**– చెరువు వద్ద సంచరిస్తున్నట్లు మేకల కాపరుల గుర్తింపు**

కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)

మండలంలోని పెద్దనపల్లి నాయకపుగూడ చెరువు సమీపంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. మంగళవారం చెరువు పరిసర ప్రాంతంలో మేకలను మేపుతున్న ఇద్దరు కాపరులకు చిరుత కనిపించినట్లు తెలిపారు. దీంతో అప్రమత్తమైన వారు మేకలను వెంటనే అక్కడి నుంచి తరలించి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు.చిరుత సంచారంతో స్థానికులు, రైతులు, పశువుల కాపరులు ఆందోళనకు గురవుతున్నారు. చెరువు పరిసరాల్లో చిరుత సంచరించిన ఆనవాళ్లను అటవీశాఖ అధికారులు పరిశీలించి, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## కాసిపేట-2 ఇంక్లైన్‌లో కార్మికుల ఆందోళన

**– అధికారుల నిర్లక్ష్యం, నాసిరకం సామగ్రే ప్రమాదానికి కారణమని ఆరోపణ.. విధులు బహిష్కరణ**

కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో కార్మికులు ఆందోళనకు దిగారు. గనిలో ఇటీవల జరిగిన ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యం, నాసిరకం సామగ్రి వినియోగమే కారణమని కార్మికులు ఆరోపించారు. భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు గనిలో కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు విధులను బహిష్కరించారు.
నాణ్యమైన సామగ్రిని అందించాలని, ప్రమాదాలకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. కిషోర్ కుమార్

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. కిషోర్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
చెన్నారావుపేట మండలం తిమ్మరాయునిపహాడ్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు, లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ వివరాల నమోదులో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.
ఈ రీసర్వే లో సంబధిత శాఖల అధికారులు సర్వేర్లు ఉన్నారు.

## రీ సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులను వరంగల్ ఆర్డీఓ సోమవారం పరిశీలించారు. గీసుగొండ మండలం ఎల్కుర్తిహవేలి గ్రామంలో తహసీల్దార్‌తో కలిసి రీ సర్వే పనులను పరిశీలించి, సర్వే ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం సంగెం మండలం ముమ్మిడివరం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను సందర్శించి పరిశీలించారు. రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వే లో సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## సీతక్క, కడియం శ్రీహరి గార్లను మర్యాదపూర్వకంగా కలిసిన గుండు సుధారాణి.

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





మంగళవారం రోజున హైదరాబాదు లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి "శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) మరియు స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గార్లను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (KUDA) చైర్ పర్సన్ గా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టిన గుండు సుధారాణి గారు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించి ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ సందర్భంగా వారు కుడా చైర్ పర్సన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించినందున గుండు సుధారాణి శుభాకాంక్షలు తెలియజేసినారు.

## వేములవాడలో భక్తజన సంద్రం:

**బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు.., 1.18 లక్షల మంది భీమేశ్వరుడి దర్శనం**

**వేములవాడ** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సోమవారం నుంచి దాదాపు 1,18,776 మంది భక్తులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.అదేవిధంగా అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ సన్నిధి మహిళా భక్తులతో కిటకిటలాడుతోంది. నిన్న ఉదయం ప్రారంభమైన రద్దీ అర్ధరాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగగా, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు, ఒడిబియ్యం, చీర-సారె, బెల్లం, సాక, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు.బద్ది పోచమ్మను లక్ష మందికి పైగా దర్శించుకుంటారని అధికారులు అంచనా వేశారు.అధికారుల నిరంతర పర్యవేక్షణ-పటిష్ట బందోబస్తు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప్ నవీన్ కుమార్ క్షేత్రస్థాయిలో ఉంటూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## నగరంలో ధర్నా చౌక్ లో బీఆర్ఎస్ మహిళా నేతల ధర్నా

(మన మీ వార్త న్యూస్): సెప్టెంబర్ 08, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్, మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ, మంజుల యాదవ్,చింతకాయల అలేఖ్య,గంగ ,సంధ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి ఇవ్వాలి

(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 08, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

- శాంతి కమిటీ సమావేశంలో సీపీని కోరిన బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో వినాయక చవితి పురస్కరించుకుని శాంతి కమిటీ సమావేశంలో దినేష్ కులాచారి మాట్లాడుతూ హిందువులు కేవలం వినాయక చవితి, శ్రీరామనవమి, హనుమాన్ జన్మోత్సవం, దేవీ నవరాత్రులు, ఛత్రపతి శివాజీ జయంతి వంటి ఐదు ప్రధాన పర్వదినాల్లో మాత్రమే సౌండ్ సిస్టమ్ ను ఉపయోగిస్తారన్నారు. 30-08-2000 నాటి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిర్దేశించిన పరిమితులకు లోబడి సౌండ్ సిస్టమ్‌కు అనుమతులు మంజూరు చేయాలి తప్ప, ఉత్సవాలను అడ్డుకోకూడదన్నారు. అలాగే సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల జీవో ప్రకారం గణేష్ ఆగమనం,నిమజ్జన ఊరేగింపులకు పూర్తిస్థాయిలో అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై సీపీ స్పందిస్తూ గణేష్ ఆగమనం, నిమజ్జనం కార్యక్రమాల్లో రెండు స్పీకర్లతో కూడిన సౌండ్ సిస్టమ్ ను నిబంధనల ప్రకారం వినియోగించుకోవడానికి అనుమతి ఇస్తామని తెలిపారన్నారు

## 23 వ రోజుకు చేరిన టీపీ జేఏసీ నిరసనలు




(మన మీ వార్త న్యూస్) : సెప్టెంబర్ 08, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి / వై ఐ ఎస్ యూ లో విలీనం చేయవద్దని టీపీజేఏసీ నిజామాబాద్ జిల్లా శాఖ నిరసనలు 23వ రోజుకు చేరాయి. మంగళవారం నగరం లోని కంటేశ్వర్ లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ లో లంచ్ అవర్ ధర్నా కొనసాగించింది. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ వ్యవస్థ గత 70 ఏళ్లుగా అత్యంత నిరుపేద, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందిస్తూ, 95% ప్రవేశాలతో విజయవంతంగా నడుస్తున్నవని అన్నారు. పాలిటెక్నిక్ పేదల విద్యా వ్యవస్థ కావున దీనిని మార్చరాదు, వేరే దానిలో విలీనం చేయవద్దని అన్నారు.పాలిటెక్నిక్ లను శక్తి లో విలీనం చేయవద్దని కమిటీ త్వరగా సమావేశమై సానుకూల నివేదిక ఇచ్చి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి అని డిమాండ్ చేసారు.

## పాఠశాలలో యూనిఫాం దుస్తుల పంపిణీ

కాసిపేట, సెప్టెంబరు 8: (మన మీ వార్త మండల ప్రతినిధి)



కాసిపేట మండలంలోని పల్లంగూడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు యూనిఫాం దుస్తులను సర్పంచ్ దుస్స విజయ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, చిన్నారులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు మేహరున్నిస, సీసీ భాస్కర్, వీఓఏ సరిత, మహిళా సంఘం సభ్యులు వసంత, సరిత, కళ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో కేటీఆర్, హరీష్ రావు దిష్టిబొమ్మల దహనం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఉప్పల్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):





తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేతలను నిరసిస్తూ ఉప్పల్‌లో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావుల దిష్టిబొమ్మలను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలకు కారణమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు సంబంధిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన అసెంబ్లీ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలని, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రివెంటివ్ మెజర్స్ పేరుతో బీఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్ట్







- ఉప్పల్‌లో ధర్నాలు, రాస్తారోకోలకు కాంగ్రెస్ నాయకులకు పోలీసులు సహకరిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతల ఆరోపణ

ఉప్పల్, సెప్టెంబర్ 8 ( మన మీ వార్త):

ప్రివెంటివ్ మెజర్స్ పేరుతో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు నిర్బంధించడంపై ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్, చిల్కానగర్, బీరప్పగడ్డ, రామంతపూర్, హబ్సిగూడ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను మంగళవారం ఉదయం 6 గంటల నుంచే పోలీసులు హౌస్ అరెస్ట్ పేరుతో పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించారని ఆయన ఆరోపించారు.మరోవైపు ఉప్పల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహిస్తూ బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేస్తుంటే, వారికి ఉప్పల్ పోలీసులు ఎస్కార్ట్‌గా ఉండి సహకరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులను ప్రశ్నించగా, తమను ప్రివెంటివ్ మెజర్స్ కింద అరెస్టు చేశామని, దిష్టిబొమ్మలు దహనం చేసిన వారిపైనా కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పోలీసుల వైఖరి పక్షపాతంగా ఉందని ఆరోపించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తోందని, పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో రెండు సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయని, పోలీసులు ఈ విషయాన్ని గమనించి ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని పార్టీలను సమానంగా చూడాలని కోరారు.పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ నాయకులుగా తాము పూర్తిగా సహకరిస్తామని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వరరావు, హనుమంతు రెడ్డి, బాబు యాదవ్, బోసాని పవన్, దయాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, ముస్తాక్, టీఆర్ఎస్వీ ప్రశాంత్ గౌడ్, కరిపె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల అనుమతులు తప్పనిసరి

- చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్

చిట్యాల సెప్టెంబర్ 8 మీ వార్త




చిట్యాల మండల పరిధిలోని గ్రామాలు, పట్టణంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం, పోలీస్ శాఖ నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ పోచంపల్లి సతీష్ స్పష్టం చేశారు.
?శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సౌకర్యార్థం మండప నిర్వాహకులు కింది నిబంధనలు పాటించాలి:

**1. ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి:**

- మండపం ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ముందుగా తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- పోర్టల్‌లో నిర్వాహకుల పూర్తి వివరాలు, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు, విగ్రహ ప్రతిష్ఠాపన స్థలం, నిమజ్జన తేదీ తదితర వివరాలను నమోదు చేసి అనుమతి పత్రం పొందాలి.

**- 2. విద్యుత్ & అగ్నిమాపక భద్రత:**

మండపాలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- అనధికారికంగా విద్యుత్ తీగలను లాగడం, కొక్కేలు వేయడం చట్టరీత్యా నేరం.
- మండపంలో నాణ్యమైన వైరింగ్ ఉపయోగించాలి; షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్నిప్రమాద నివారణకు సరిపడా నీరు, ఇసుక బకెట్లు లేదా ఫైర్ ఎక్స్‌టింగిషర్లను సిద్ధంగా ఉంచాలి.

- 3. సీసీ కెమెరాలు ఉ నిరంతర పర్యవేక్షణ:
- ప్రతి మండపం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చాలి.
- మండపం వద్ద రాత్రింబవళ్లు కనీసం 2 నుండి 3 గురు వాలంటీర్లు/నిర్వాహకులు నిరంతరం కాపలాగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- 4. మైక్ సెట్లు / సౌండ్ సిస్టమ్ నిబంధనలు:
- బాక్స్ టైప్ స్పీకర్లను మాత్రమే తక్కువ శబ్దంతో ఉపయోగించాలి.
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10:00 గంటల నుండి ఉదయం 06:00 గంటల వరకు మైకులు, సౌండ్ బాక్సులు పూర్తిగా నిషేధం.
- వృద్ధులు, విద్యార్థులు, రోగులకు ఇబ్బంది కలగకుండా శబ్ద పరిమితులను ఖచ్చితంగా పాటించాలి. డీజే సౌండ్ సిస్టమ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు.

**- 5. ఇతర ముఖ్య నిబంధనలు:**

- రోడ్లపై ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలు నిర్మించాలి.
- మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.
- కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే పాటలు, బ్యానర్లు, ప్రసంగాలను పూర్తిగా నిషేధించడమైనది.
- నిమజ్జనం రోజున పోలీసు శాఖ సూచించిన నిర్దేశిత మార్గాలు, సమయపాలన పాటించాలి.
- గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకొని పోలీసు శాఖకు సహకరించాలని మండల ప్రజలకు, నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అత్యవసర సమయాల్లో లేదా ఏదైనా సమాచారం కోసం స్థానిక పోలీసులను గానీ, డయల్ 100 ను గానీ సంప్రదించగలరు.

## కుషాయిగూడ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలి: ఎస్ ఎఫ్ ఐ డిమాండ్

కాప్రా సెప్టెంబర్ 8: (వార్త ప్రతినిధి)



కుషాయిగూడ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న వేధింపులు, అసాంఘిక వ్యక్తుల సంచారంపై ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం కాప్రాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, పాఠశాల ప్రాంగణంలో అసాంఘిక శక్తుల వల్ల విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు: పాఠశాల గేటు వద్ద రోజూ సుమారు 10 మందికి పైగా ఆకతాయిలు గుమిగూడి విద్యార్థినులను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం చేస్తున్నారు. సెలవు రోజుల్లో అనధికారిక ప్రవేశాలు, ఆవరణలో మద్యం సీసాలు లభించడం ఆందోళనకరం. సి సి టీవీ నిఘా: కుషాయిగూడ పాఠశాలతో పాటు మేడ్చల్ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల్లో తక్షణమే పనిచేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఈగిల్ టీమ్, పోలీసుల పెట్రోలింగ్: పాఠశాల ప్రారంభ, ముగింపు సమయాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి. విద్యార్థినుల భద్రత కోసం ఈగిల్ టీమ్ ప్రత్యేకంగా స్పందించి తనిఖీలు చేపట్టాలి. ఈ విషయమై ఇప్పటికే కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు వినతిపత్రం సమర్పించినట్లు నేతలు తెలిపారు. ముందస్తు భద్రతా చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్, కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్, జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం

- రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక, తాంత్రిక పూజా విధానాలపై శిక్షణ
- మంత్రోపదేశ మహోత్సవంతో ముగిసిన కార్యక్రమం

మీ వార్త / కుత్బుల్లాపూర్ :

కేరళ సంప్రదాయ తాంత్రిక విధానంలో అయ్యప్ప స్వామి పూజా విధానాలను పరిచయం చేయడంతో పాటు భక్తులు, సాధకులకు ఆధ్యాత్మిక సాధన, పూజా ప్రక్రియలపై ప్రాయోగిక అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం ఘనంగా జరిగింది. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో, కేరళ చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.







**తొలిరోజు ప్రాయోగిక శిక్షణ:**
సెప్టెంబర్ 6న కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై సాధకులకు ప్రాయోగిక శిక్షణ అందించారు. గురు ఆగమనం, గురు వందనంతో పాటు వివిధ పూజా ప్రక్రియలపై ప్రత్యేక ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు. అనంతరం అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజలను కేరళ తాంత్రిక సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం జరిగిన అయ్యప్ప భజన సంధ్య భక్తులను ఆకట్టుకుంది.

**మంత్రోపదేశ మహోత్సవం:**
సెప్టెంబర్ 7న జరిగిన రెండో రోజు కార్యక్రమంలో అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తంత్ర గురు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో మంత్రోపదేశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గురు పాద పూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీతో పాటు పాల్గొన్న సాధకులు, ప్రముఖులకు జ్ఞాపికలు అందజేశారు.

గురూజీతో ముఖాముఖి:
సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సాధకులకు గురూజీతో వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం కల్పించారు. ఆధ్యాత్మిక సాధన, పూజా విధానాలు, అయ్యప్ప పడి పూజ తదితర అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ప్రత్యేక సందర్భాల్లో పూజా విధానాలపై మార్గదర్శకత్వం పొందే అవకాశం కల్పించారు.
కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలను అధ్యయనం చేయాలనుకునే సాధకులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. "నేర్చుకోవడం -- సాధన చేయడం -- అనుభవించడం -- గురు ఆశీస్సులు పొందడం" అనే విధానంలో కార్యక్రమాన్ని రూపొందించడం ఈ సమ్మేళనం ప్రత్యేకతగా నిలిచిందని పేర్కొన్నారు.

## కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ ఎస్సీ విభాగం పిలుపు

# గజ్వేలుకు మారిన రాజకీయం

**మెదక్, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా గజ్వేల్ పరిధిలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా మారింది. కాంగ్రెస్ దళిత ప్రజాప్రతినిధులు కేసీఆర్ ఫామ్ హౌస్‌ను ముట్టడిస్తామని బహిరంగంగా ప్రకటించడంతో శాసనసభ లోపలి వేడి కాస్తా నేరుగా వీధుల్లోకి వచ్చింది. స్పీకర్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అవమానించారని .. కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ఎర్రవల్లి వైపు కదిలారు. కాంగ్రెస్ నేతలు నేరుగా ఫామ్ హౌస్ వైపు దూసుకురావడంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కాంగ్రెస్ ఎమ్మెల్యేల ముట్టడి పిలుపుపై సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకత్వం తక్షణమే స్పందించింది. ఫామ్ హౌస్ రక్షణ కోసం పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులను అక్కడికి తరలించింది. శాసనసభ సమావేశాల్లో పాల్గొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సైతం సభ పరిణామాలను పక్కనపెట్టి ఫామ్ హౌస్ వద్దకు బయలుదేరి వెళ్లారు. బీఆర్ఎస్ కేడర్ ఫామ్ హౌస్ పరిసరాల్లో మోహరించి కాంగ్రెస్ నిరసనకారులను అడ్డుకునేందుకు సిద్ధమవడంతో, రెండు ప్రధాన పార్టీల శ్రేణుల మధ్య ముఖాముఖీ పోరుకు వేదికైంది.పరిస్థితి చేయిదాటిపోకుండా పోలీసులు ఎర్రవల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించారు. ఫామ్ హౌస్‌కు వెళ్లే ప్రధాన రహదారులన్నింటినీ బారికేడ్లతో మూసివేసి, విస్తృత తనిఖీలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను, వారి అనుచరులను మార్గమధ్యంలోనే నిలిపివేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో పలుచోట్ల తీవ్ర తోపులాటలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష నేత నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిరసనలకు దిగడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ మండిపడుతుండగా, దళిత గౌరవం కోసమే తాము ప్రశ్నిస్తున్నామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇరువర్గాల మోహరింపులు, శాంతిభద్రతల సవాళ్ల నడుమ ఈ రోజంతా తెలంగాణ రాజకీయం ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూనే భ్రమిస్తోంది. ఒకవైపు అసెంబ్లీలో ప్రతిష్టంభన, మరోవైపు క్షేత్రస్థాయిలో నేతల ముట్టడి యత్నాలతో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వైరం పరాకాష్టకు చేరింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో ఎర్రవల్లి ప్రాంతంలో తీవ్ర ఉత్కంఠ వాతావరణం కొనసాగుతోంది
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల దుమారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద దాడులు, ప్రతిదాడులకు దారితీసింది. ఓవైపు అసెంబ్లీలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే, తీవ్ర పరిణామాల సమాచారం అందుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ సమావేశాల నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌కు బయల్దేరారు. స్పీకర్ వివాదం, సభలో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల ప్రవర్తన, అభ్యంతరకర భాషపై తదుపరి కార్యాచరణను అధినేత కేసీఆర్‌తో చర్చించి ఆయన దిశానిర్దేశం తీసుకోనున్నారు. మరోవైపు, స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిస్తూ వెయ్యి డప్పులతో బయల్దేరడంతో పరిస్థితి దారితప్పింది. మర్కుక్ మండలం దామరకుంట వద్ద ఫాంహౌస్ వైపు వస్తున్న కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో తీవ్ర ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్ నేతల వాహనాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ల దాడికి పాల్పడటంతో ఇరువర్గాలు రోడ్డుపైనే తీవ్ర తోపులాటకు దిగాయి.పరిస్థితి తీవ్రం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి ఫాంహౌస్ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా 144 సెక్షన్ విధించారు. వెంకటాపూర్, ఎర్రవల్లి శివారు దారుల్లో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిరసనకారులు ఫాంహౌస్ దరిదాపుల్లోకి రాకుండా పహారా పెంచి, వందలాది మంది పోలీసులతో బందోబస్తును కట్టుదిట్టం చేశారు.



**క్రిశాంక్ అరెస్ట్**
శాసనసభ సమావేశాల వేళ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. తాతా మధు తదితర నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు... బీఆర్ఎస్ మన్నె క్రిశాంక్ ను కూడా అరెస్ట్ చేశారు. క్రిశాంక్ నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు కార్ఖానా పోలీస్ స్టేషన్ కు తరలించారు. క్రిశాంక్ కు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడుతున్నందునే బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

**హైదరాబాద్** వంటగ్యాస్ బుకింగ్ గడువును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది గ్రామీణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపీ వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై పడిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని గతంలో దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఆ మార్పుల ప్రకారం రీఫిల్ బుకింగ్ మధ్య గడువు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఎల్పీజీ సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో పాటు రీఫిల్ పెండింగ్ బాకీలు బ్యాక్‌లాగ్ కూడా గణియంగా తగ్గడంతో ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా 25 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. తక్షణమే అమల్లోకి:అయితే దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో తీసుకువచ్చిన ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎల్పీజీ వినియోగదారులకు భారీ ఊరటగా మారనుంది.



## జనగామ ఎస్ఐఆర్-2026 గడువు పొడిగింపు -- అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరణ

రివైజ్డ్ షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్,

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ాజూవఎఖుశ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ--2026) కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు వంటి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా విచారణకు హాజరై తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. సవరించిన షెడ్యూల్ క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ: 17 ఆగస్టు -- 7 అక్టోబర్ నోటీసుల దశ, విచారణలు, క్లెయిమ్స్ - అభ్యంతరాల పరిష్కారం: 17 ఆగస్టు -- 5 నవంబర్
తుది ఓటరు జాబితా ప్రచురణ: 9 నవంబర్ జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (జు=ాలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ూజు=ాలు), సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు (దీూాలు) సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.
ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు లోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## చీకటి వెలుగు ఎడిటర్ కంది సూర్యనారాయణ, దేవరకొండ నాగరాజులకు 'మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం'

మన మీ వార్త సెప్టెంబర్ 08 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

సమాజ సేవలో చేస్తున్న కృషికి గుర్తింపుగా చీకటి వెలుగు ఎడిటర్ కంది సూర్యనారాయణ గారు, శ్రీ దేవరకొండ నాగరాజు గారిని ఘనంగా సన్మానించి 'మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం' అందజేశారు. హైదరాబాద్ కోఠిలోని బీసీ సాధికారత సంస్థ ఆడిటోరియంలో నాయి బ్రాహ్మణ జన సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.





హైదరాబాద్: సమాజ సేవలో చేస్తున్న కృషిని గుర్తిస్తూ చీకటి వెలుగు ఎడిటర్ శ్రీ కంది సూర్యనారాయణ దేవరకొండ నాగరాజు ని ఘనంగా సన్మానించి 'మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం' ప్రదానం చేశారు. నాయి బ్రాహ్మణ సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా నాయి బ్రాహ్మణ జన సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోఠి బీసీ సాధికారత సంస్థ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కంది సూర్యనారాయణ మాట్లాడుతూ, యువత సమాజ సేవలో ముందుకు రావాలని, తమకు సాధ్యమైన విధంగా సమాజానికి సహాయం చేయడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.
మహిళలు స్వావలంబన సాధించేలా కుట్టు మిషన్ శిక్షణ అందించేందుకు ప్రత్యేక కేంద్రం లేదా భవనం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, ఆర్థికంగా వైద్యం చేయించుకోలేని వారికి సహాయం అందించేందుకు వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.
తమ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు, నాయి బ్రాహ్మణ జన సంస్థ ప్రతినిధులకు కంది సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నాగరాజు ని కూడా ఘనంగా సన్మానించి, సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని అందజేశారు.

## కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ స్వాధీనం

**ముగ్గురు పెడ్లర్లు అరెస్టు**

**హైదరాబాద్** నాలుగో సారి హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ ని బట్టబయలు చేసామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి అన్నారు. డ్రై గంజాను ట్రాన్స్ పోర్టు చేయటం కష్టం అవుతుందని, హాషిష్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నారు. కోటిన్నర రూపాయల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్ పట్టుకున్నాం. కుషాయిగూడ లో ఈ ముఠాను పట్టుకున్నామని అన్నారు. ముగ్గురు పెడ్లర్లు పట్టుకున్నాం, ఇద్దరు సప్లయర్ లు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న సప్లయర్ విజయ్ కీలకం.. నాలుగు నగరాలకు హాషిష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు . విజయ్ ను పట్టుకుంటే మొత్తం నెట్వర్క్ వెలుగులోకి , ఆర్గనైజ్డ్ గా ట్రాన్స్పోర్ట్ చేస్తున్నారు. ఒక్క గ్రాము హాషిష్ ఆయిల్ రెండు నుంచి మూడు వేలకు అమ్ముతున్నారు. ఒక్కసారి ఒక్క గ్రాము తీసుకుంటే వారం రోజుల పాటు ఆ మత్తు ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదు చేసి, 107 మందిని అరెస్టు చేశాం. ఈ ఏడాది ఐదు కోట్ల రూపాయల విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

## ఆర్మీ అయుధాల చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్** ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది . అనుమానితుల ఎలిమినేషన్ ప్రాసెస్ స్టార్ట్ చేశామని మల్కాజ్ గిరి పోలీసు కమిషనర్ సుమతి వెల్లడించారు. ఒక క్రమపద్దతిలో దర్యాప్తు చేస్తున్నాం,. అన్ని ఏజెన్సీలతో కలిసి పని చేస్తున్నాం. త్వరలోనే కేసు మిస్టరీని చేధిస్తాం. కేసు ఇన్విస్టిగేషన్ ఇంకా కొనసాగుతుందని అన్నారు.

## అబద్ధాలు, మోసలతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన

**సికింద్రాబాద్.** అబద్ధాలు, మోసలతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన సాగిందని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నేడు సికింద్రాబాద్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీత, ఆకుల రూప మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, అన్నారు.

# నా వడోదరా అద్భుతం

అభివృద్ధి పనులను ప్రశ్నించే వారిపై ప్రధాని నరేంద్ర మోదీ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించే నారాజ్ ఫూఫా (అలకపాన్పు ఎక్కిన మేనమామ) ఒకరు ఉంటారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందంటూ చురకలు అంటించారు. గుజరాత్‌లోని వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మోదీ, 2047 నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.



### 'నారాజ్ ఫూఫాకు పని దొరికింది

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. ఈ కారిడార్ వల్ల ట్రక్కుల అవసరం తగ్గితే ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని కొందరు ప్రశ్నిస్తారని అన్నారు. అలాంటి వారిని నారాజ్ ఫూఫాగా అభివర్ణించారు. 'ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏంటి? ట్రక్కులు ఎక్కడికి వెళ్తాయి? ట్రక్కులు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏంటి?' అంటూ వారు ప్రశ్నిస్తారని మోదీ అన్నారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందని చమత్కరించారు. ఎవరి పేరును ప్రస్తావించకుండానే ఈ వ్యాఖ్యలు చేశారు.

### 250 ట్రక్కుల సరుకు ఒకే రైలులో!

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ సామర్థ్యాన్ని వివరించేందుకు మోదీ ఓ ఉదాహరణ చెప్పారు. ఇటీవల ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ నుంచి వడోదరకు డబుల్‌స్టాక్ కంటైనర్ రైలు నడిచిందని తెలిపారు. ఒకే రైలులో రెండు వరుసల్లో కంటైనర్లను తరలించినట్లు చెప్పారు. ఈ ఒక్క రైలు ప్రయాణంలో తరలించిన సరుకు 250కుపైగా ట్రక్కులు మోసే సామర్థ్యానికి సమానమని వివరించారు. ఇలాంటి రైళ్లతో సరుకు రవాణా వేగంగా జరగడంతో పాటు ఇంధనం, సమయం, రవాణా ఖర్చులు కూడా ఆదా అవుతాయని చెప్పారు.

### 2,800 కి.మీ. ఫ్రైట్ కారిడార్ పూర్తి

దేశంలో సరుకు రవాణా వ్యవస్థలో కీలక మార్పునకు కారణమవుతున్న డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పనులు పూర్తయ్యాయని ప్రధాని ప్రకటించారు. తూర్పు, పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కలిపి మొత్తం 2,800 కిలోమీటర్ల పొడవు ఉన్నాయని తెలిపారు. దేశ వాణిజ్యం, సరుకు రవాణాకు ఈ కారిడార్లు వెన్నెముకగా మారుతున్నాయని మోదీ అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌కు ఇవి లైఫ్‌లైన్‌లా పనిచేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్లు ఒకే ట్రాక్‌పై నడిచేవని, దీంతో ప్రయాణికుల రైళ్ల వేగంతో పాటు సరుకు రవాణా కూడా నెమ్మదించేదని తెలిపారు. ప్రత్యేకంగా సరుకు రైళ్ల కోసం ఏర్పాటు చేసిన కారిడార్ అందుబాటులోకి రావడంతో ఈ సమస్య పరిష్కారమైందన్నారు.

### 100 కి.మీ. ప్రయాణం- సగం సమయంలోనే!

ఫ్రైట్ కారిడార్ వల్ల సరుకు రవాణా వేగం గణనీయంగా పెరిగిందని మోదీ చెప్పారు. గతంలో సరుకు రైలు 100 కిలోమీటర్లు ప్రయాణించడానికి సుమారు 6.5 గంటలు పట్టేదని, ఇప్పుడు అదే దూరాన్ని సగం కంటే తక్కువ సమయంలో చేరుకుంటోందన్నారు. ట్రక్కులో సాధారణంగా 30 గంటలు పట్టే సరుకు రవాణా, ఫ్రైట్ కారిడార్ ద్వారా 10 నుంచి 12 గంటల్లో పూర్తవుతోందని వివరించారు. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గుతుందని, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని, సమయం కూడా మిగులుతుందని చెప్పారు. పర్యావరణానికి కూడా ఇది మేలు చేస్తుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం తూర్పు, పశ్చిమ ఫ్రైట్ కారిడార్లపై రోజుకు 430కుపైగా సరుకు రైళ్లు నడుస్తున్నాయని మోదీ తెలిపారు.

### 2014కు ముందు ఫైళ్లు తిరిగాయ్!

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వాన్ని కూడా మోదీ విమర్శించారు. ఈ ప్రాజెక్టు ఆలోచన 2004లో ప్రారంభమైందని, 2006లో పనుల కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసినా 2014 వరకు ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని అన్నారు. ఏళ్ల తరబడి ఫైళ్లు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతూనే ఉండేవని ఎద్దేవా చేశారు. 2014 తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామని చెప్పారు. గుజరాత్‌లో తనకు లభించిన అనుభవం, అక్కడి ప్రజల నుంచి నేర్చుకున్న పాఠాలను ఢిల్లీకి తీసుకెళ్లానని మోదీ తెలిపారు. ఆ అనుభవంతో దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు.

### రూ.35 వేల కోట్ల పనులు

వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో మోదీ రూ.35 వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు సంబంధించిన మూడు కీలక విభాగాలు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారి పనులు, గుజరాత్ ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులు ఉన్నాయి. న్యూ సనంద్, న్యూ మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి సరుకు రైళ్లను మోదీ ప్రారంభించారు. టాండా రోడ్-వడోదర మధ్య ప్రయాణికుల రైలు సేవలను కూడా ప్రారంభించారు.

### గతిశక్తికి పెద్దపీట

దేశ అభివృద్ధిలో కనెక్టివిటీ, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఉందని ప్రధాని చెప్పారు. పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రస్తావించిన సప్తధార సంకల్పంలో గతిశక్తి కూడా ఒకటని గుర్తు చేశారు. దేశంలోని వివిధ రవాణా మార్గాలను సమన్వయం చేయడం, సరుకు రవాణాను వేగవంతం చేయడం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం ద్వారా గతిశక్తి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై కోచింగ్ ఖర్చుల భారం తగ్గించేందుకు కేంద్రం మరో కీలక అడుగు వేస్తోందని మోదీ తెలిపారు. దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి ఏడాది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పిల్లల కోచింగ్ కోసం మధ్యతరగతి కుటుంబాలు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. అలాంటి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

### ఏఐలో యువత నిపుణులు కావాలి

ప్రపంచం వేగంగా మారుతోందని దానికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాల అవసరాలు కూడా మారుతున్నాయని ప్రధాని అన్నారు. గతంలో డిగ్రీలకు మాత్రమే ప్రాధాన్యం ఉండేదని, ఇప్పుడు నైపుణ్యాలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత యువత నైపుణ్యాలు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐలో భారత యువత ప్రపంచస్థాయిలో నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ మరోసారి స్పష్టం చేశారు. రవాణా నుంచి విద్య, నైపుణ్యాల వరకు అన్ని రంగాల్లో ఆధునిక మార్పులు తీసుకురావడమే వికసిత్ భారత్ దిశలో కీలకమని పేర్కొన్నారు.

### నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు.

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# అరాచకాలను అరికట్టేందుకు అమిత్ షా శాఖ ఏం చేస్తోంది?

ఢిల్లీలో మణిపుర్‌కి చెందిన సంగీత కళాకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలోనే ఇంటి బయట ఓ తండ్రిని కొట్టి చంపడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పెరుగుతున్న ఈ అరాచకాలను అరికట్టడానికి అమిత్? షా హోం మంత్రిత్వ శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఇంటి బయట శబ్దం తగ్గించమని చెప్పేందుకు కిందికి వెళ్లిన ప్రముఖ మణిపురి సంగీతకారుడిని కొట్టి చంపారు. దేశ రాజధానిలో తన ఇంటి బయటే ఓ తండ్రి హత్యకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో నివసిస్తున్న ప్రతి ఈశాన్య ప్రాంతాల కుటుంబం ఒకే ప్రశ్న అడుగుతోంది. ఇక్కమేం సురక్షితంగా ఉన్నామా? ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలకు చెందిన ప్రజలపై జరుగుతున్న ఘటనలను అరికట్టేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఢిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారు. పెరుగుతున్న అరాచకాన్ని నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. త్వరితగతిన ద్యరాప్తు జరిపి, దోషులను న్యాయ స్థానం ముందు నిలబెట్టాలి' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

### ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం : పవన్ ఖేడా

మరోవైపు ఈ ఘటనపై కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ పవన్ ఖేడా కూడా తీవ్రంగా స్పందించారు. సంగీతకారుడి మృతి చుట్టు నెలకొన్న పరిస్థితులకు దారి తీసిన సంస్కృతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టించాయని ఆరోపించారు. 'దీనిని మద్యం మత్తులో జరిగిన హింసాత్మక ఘటనగా కొట్టిపారేయవచ్చు. కానీ దీని వెనక ఇంకా చాలా ఉంది. గత కొన్నేళ్లుగా బహిరంగ ప్రదేశాల్లో భారీ డీజేలు, రచ్చ చేయడం, నిబంధనలను బేఖాతరు చేయడాన్ని ప్రభుత్వం అలవాటుగా మార్చింది. చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సింది పోయి, అధికారంలో ఉన్నవారు కళ్లు మూసుకోవడం వల్లే నేరస్థుల్లో భయం లేకుండా పోయింది. ఈ దారుణానికి దారితీసిన వాతావరణాన్ని సృష్టించిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదు' అని పవన్? ఖేడా అన్నారు. ఈ ఘటనపై ఈశాన్య భారత (నార్త్ ఈస్ట్) కమ్యూనిటీ ప్రతినిధి సంగీతా దేవి కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విక్రమ్ సింగ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, ఆయన కుటుంబ భవిష్యత్తును ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మణిపుర్?కు చెందిన సంగీతకారుడు చోంగ్తామ్ విక్ర సింగ్ (54) ఢిల్లీలోని కిలోక్రి గ్రామంలో కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఇంటి సమీపంలో కొందరు ధాబా, డెలవరీ సిబ్బంది మద్యం సేవిస్తూ గట్టిగా ఆరుస్తున్నారు. దీంతో సింగ్ బయటకు వచ్చి శబ్దం తగ్గించాలని కోరారు. ఇరువురి మధ్య వివాదం తలెత్తడంతో వారు విక్రమ్? సింగ్?పై పిడిగుద్దులు, దెబ్బలతో దాడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్రసంగా గాయపడిన విక్రమ్?ను ఆయన కుమారుడు వెంటనే హోలీ ఫ్యామిలీ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని తెలిపారు. ఈ ఘటనపై సన్?లైట్? కాలనీ పోలీస్? స్టేషన్ పీసీఆర్? కాల్ రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, దాడికి దారితీసిన పరిస్థితులు, విక్రమ్ మృతికి కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

### ఏడుగురు అరెస్ట్

ఘటనకు సంబంధించి పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అలాగే ఓ బాలుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి. దాడి వెనుక ఉన్న పూర్తి కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు. విక్రమ్ సింగ్ మృతికి ఈశాన్య విద్యార్థి సంఘం కూడా సంతాపం తెలిపింది. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ సొసైటీ ఆయనను గౌరవనీయమైన మణిపురి సంగీతకారుడిగా పేర్కొంది.

## బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందు, సెప్టెంబర్? 11న ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ కానున్నారు. ఈ విషయాన్ని రష్యా అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మంగళవారం వెల్లడించారు. తాము కొత్త అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై భారత్‌తో చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పెస్కోవ్? చెప్పారు. తమ ఎజెండాలో భారత్‌కు ఎస్‌యూ-57 విమానాల విక్రయం కూడా ఉందని ఆయన తెలిపారు. "భారతదేశం మా వ్యూహాత్మక భాగస్వామి. మేము భారత్?ను అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా పరిగణిస్తాం. ఇరుదేశాల నాయకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య చెల్లింపుల్లో అధిక భాగం సొంత కరెన్సీల్లోనే జరుగుతోంది. ఇది క్రమంగా ఇంకా పెరుగుతోంది. రక్షణ, ఇంధనం, రవాణా, శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం విస్తరిస్తోంది" అని పెస్కోవ్ పేర్కొన్నారు.

### మోదీ, పుతిన్ చాలా సన్నిహితులు

ఢిల్లీలో సెప్టెంబర్ 12 నుంచి బ్రిక్స్ సదస్సు ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్? వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నాల్లో తన వంతు సహకారాన్ని అందించడానికి భారతదేశం చూపుతున్న సుముఖతను మాస్కో స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. "మరో రెండు రోజుల్లో అధ్యక్షుడు పుతిన్? తన భారత పర్యటనను ప్రారంభిస్తారు. మోదీ, పుతిన్?లు వ్యక్తిగతంగా సన్నిహితులు అనే విషయం మీకు తెలుసు. వారు తమ సంబంధాల విషయంలో ఎంతో ఆచరణాత్మకంగా వ్యవహరిస్తారు. మన ఉమ్మడి ఎజెండాలోని, ద్వైపాక్షిక సంబంధాల్లోని అత్యంత సున్నితమైన అంశాలను కూడా బహిరంగంగా, నిర్మాణాత్మకంగా చర్చించగలిగేంత నిజాయితీ, నమ్మకం వారి మధ్య ఉన్నాయి. ఇది కచ్చితంగా మన మధ్య సహకారానికి సరికొత్త అవకాశాలను తెరుస్తుంది" అని పెస్కోవ్ అన్నారు. భారతదేశంలో కొత్త అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంపై చర్చల కోసం రష్యా ఎదురుచూస్తోందని పెస్కోవ్ తెలిపారు. భారతదేశానికి సుఖోయ్?-57 యుద్ధవిమానాల విక్రయం కూడా తమ ఎజెండాలో ఉందని ఆయన వెల్లడించారు. కొన్ని దేశాలు తమ కరెన్సీలను రాజకీయ అణచివేతకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

సెప్టెంబర్ నెలలో వర్షాలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాల తీవ్రత తక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో ఇప్పటికే వర్షపాత లోటు కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల ప్రకారం దక్షిణ ద్వీపకల్పంలో రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితి ప్రాంతాల వారీగా మారనుంది.

### ఏపీలో 45 శాతం వర్షపాతం లోటు

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే 45 శాతం తక్కువ వర్షం నమోదైంది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అధిక వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో ఏపీ కూడా ఉంది. రానున్న రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. అయితే వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 ప్రాంతంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్-- దక్షిణ ఒడిశా తీరాల సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

### తెలంగాణకు వరుసగా వర్ష సూచన

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాల అవకాశాలు క్రమంగా పెరగనున్నాయి. ఐఎండీ తాజా బులెటిన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత 12 నుంచి 14 వరకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంటే తెలంగాణలో వెంటనే భారీ వర్షాల పరిస్థితి కాకుండా, రానున్న రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

### తమిళనాడుకు భారీ వర్ష సూచన

దక్షిణాదిలో మరో ముఖ్యమైన మార్పు తమిళనాడులో కనిపించనుంది. సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. రాయలసీమలో కూడా సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు చెదురుమదురు నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### కేరళలోనూ లోటు

కేరళలో జూన్ నుంచి సెప్టెంబర్ 7 వరకు 24 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాబోయే రోజుల్లో మాత్రం కేరళ, మాహే ప్రాంతాల్లో కొన్ని దశల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 8, 9 తేదీలతో పాటు 13, 14 తేదీల్లోనూ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అయితే కేరళలో కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలో వాతావరణం ప్రాంతాల వారీగా మారే అవకాశం ఉంది.

### కర్ణాటకలోనూ మారనున్న వాతావరణం

ఉత్తర కర్ణాటకలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో సెప్టెంబర్ 10, 11 తేదీల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. సెప్టెంబర్ 12 నుంచి 14 మధ్య దక్షిణ కర్ణాటకలోనూ వర్షాల విస్తృతి పెరగొచ్చని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని వాతావరణ పరిస్థితులు ఒకే విధంగా లేవు. ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం ఉండగా, దక్షిణ ద్వీపకల్పంలో మాత్రం వర్షాలు ప్రాంతాల వారీగా మారుతున్నాయి. అందుకే వర్షపాతం లోటు ఉన్న రాష్ట్రాల్లో ఒక్కసారిగా భారీ వర్షాలు కురిసినా మొత్తం లోటు వెంటనే పూడిపోదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 45 శాతం లోటు ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో రాబోయే రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం ఉన్నా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో వర్షాలు పడతాయని చెప్పలేం.

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ (26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గతేడాది 32వ స్థానంతో పోలిస్తే ఢిల్లీ తన ర్యాంకును మెరుగుపరుచుకోవడం విశేషం. ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో, పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్రం ఈ సర్వేను నిర్వహిస్తోంది. కేవలం గాలి నాణ్యత స్థాయిలను కాకుండా, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఈ సర్వే మదింపు చేస్తుంది. రోడ్ల పై దుమ్ము నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు, వాహన, పారిశ్రామిక ఉద్గారాల తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల, గాలి నాణ్యత తక్కువగా ఉన్న నగరం సైతం.. నియంత్రణ చర్యలను బలంగా అమలు చేస్తే మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. ఢిల్లీ విషయంలో ఇదే జరిగింది.

### ఢిల్లీలో వాస్తవ పరిస్థితి

ర్యాంకు మెరుగైనప్పటికీ, ఢిల్లీలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగానే ఉన్నాయి. 2025లో పీఎం10 కణాలు జాతీయ సగటు (60 స్త్ర/ఎట) కంటే చాలా ఎక్కువగా 198 స్త్ర/ఎటగా నమోదయ్యాయి. అలాగే పీఎం2.5 కణాలు కూడా నిర్దేశిత పరిమితి (40 స్త్ర/ఎట) కంటే రెట్టింపునకు పైగా 97 స్త్ర/ఎటగా రికార్డయ్యాయి. 2026 జనవరిలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ ×ం ఆంక్షలను కూడా విధించారు. మొత్తం 130 నగరాల్లో ఈ సర్వే నిర్వహించగా, 3-10 లక్షల జనాభా కేటగిరీలో రవుర్కెలా, 3 లక్షల లోపు జనాభా కేటగిరీలో కళింగ నగర్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

# రెండోరోజూ అదే వేడి‘

-మొదటిపేజీ తరువాయి

సాగగా, కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం ముట్టడి కార్యక్రమం, కేసీఆర్‌ను ఉద్దేశించి ఆ పార్టీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు తాజా ఉద్రిక్తతకు, వివాదానికి దారి తీశాయి. మరోవైపు మహిళా పోలీసులపై బీఆర్ఎస్ సభ్యుల దురుసు ప్రవర్తనపై కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇక అసెంబ్లీ లాబీల్లోనూ ఇదే అంశం నడిచింది.

### ఎమ్మెల్యేలతో మంతనాలు

ఉదయం అసెంబ్లీకి రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్ చాంబర్‌కు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ప్రభుత్వం పక్షాన అండగా ఉంటామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఓదార్చారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి తన చాంబర్‌లో రాష్ట్ర మంత్రులతో పలు దఫాలు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల విషయంలో అసెంబ్లీ వేదికగా ఏం చేయాలన్న దానిపై అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతితో చర్చించారు. ప్రభుత్వం తరఫున ప్రవేశపెట్టే తీర్మానం ఎలా ఉండాలి? భవిష్యత్తులో న్యాయ వివాదాలు రాకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాలపై మాట్లాడిన సీఎం.. ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలిని కోరుతూ శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహతో తీర్మానం ప్రతిపాదింపజేసి, ఆమోదింపజేయాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు కూడా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించారు. కాంగ్రెస్ ముట్టడి కార్యక్రమాన్ని ధీటుగా ఎదుర్కోవాలని, ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు. తాతా మధు, నవీన్‌రెడ్డిల సస్పెన్షన్ నేపథ్యంలో నిరసనలు, ధర్నాతో బీఆర్ఎస్ నేతలు వాతావరణాన్ని మరింత వేడెక్కించారు.


### ‘అనుచిత వ్యాఖ్యలపై’చర్చ..సస్పెన్షన్ తీర్మానం

మంగళవారం మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత ప్యానెల్ స్పీకర్ స్థానంలోకి వచ్చిన కడియం శ్రీహరి సోమవారం నాటి అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై చర్చను ప్రారంభించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించగా, పలువురు మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడారు. ఆ తర్వాత మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యకు విజ్ఞప్తి తీర్మానం ప్రవేశపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన తర్వాత ఈ తీర్మానాన్ని సభ ఆమోదించి శాసనమండలికి పంపింది.

### స్పీకర్ మనస్తాపం..

తాతా మధు ఎపిసోడ్‌లో కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. అసెంబ్లీలో మాట్లాడిన హరీశ్‌రావు వీలున్నంత వరకు తమ పార్టీ ఎమ్మెల్సీలకు మద్దతుగా నిలిచే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగానే స్పీకర్ ప్రసాద్‌కుమార్ కొంత ఆవేశానికి లోనయ్యారు. హరీశ్‌రావును ఉద్దేశించి ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల వైఖరి, హరీశ్‌రావు వ్యాఖ్యలకు స్పీకర్ మనస్తాపం చెందారు. ఉదయం సభను కొంతసేపు వాయిదా వేసిన అనంతరం చాలాసేపు ఆయన తన చాంబర్‌లోనే ఉన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు అసెంబ్లీ కార్యదర్శితో మాట్లాడారు. విలేకరులతో ఇష్టాగోష్టిలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ తర్వాత సభ లోపలికి వెళ్లిన ఆయన మనస్తాపం కారణంగా కొద్దిసేపు మాత్రమే సభా కార్యకలాపాలు నిర్వహించి, ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరికి సభాధ్యక్షత బాధ్యతను అప్పగించి వెళ్లిపోయారు.



### మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై..కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి, మట్టా రాగమయి, పరి?ణకారెడ్డి, యశస్వినిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా నేతలు కల్వ సుజాత, గుండు సుధారాణి, ఇందిరా శోభన్‌లు మహిళా కమిషన్‌ను కలిశారు. మహిళా పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించారని, వారి ముందే అర్ధనగ్న ప్రదర్శన చేశారని, అనుచితంగా వ్యవహరించారంటూ కమిషన్ కార్యదర్శి, సభ్యులకు ఫిర్యాదును అందజేశారు.

### తగ్గని బీఆర్ఎస్

**-- అసెంబ్లీ లోపలా, బయటా ఆందోళనలు**

**-- నల్ల బ్యాడ్జీలతో సమావేశాలకు హాజరు**

**-- కాంగ్రెస్ చేపట్టిన కేసీఆర్ ఎర్రవల్లి నివాసం ముట్టడి కార్యక్రమంపై మండిపాటు**

**-- తాతా మధు, నవీన్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన, ధర్నా**

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అసెంబ్లీ లోపలా, బయట అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం కొనసాగించింది. మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల బ్యాడ్జీలు ధరించి సమావేశాలకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన చర్చల్లో ప్రతిష్టంభన నెలకొనడంతో స్పీకర్ సభకు విరామం ప్రకటించారు. ఈ నేపథ్యంలో శాసనసభ లాబీల్లోని బీఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. సభ లోపలా బయటా కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలపై చర్చించారు. ఎర్రవల్లిలో పార్టీ అధినేత కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్తున్నట్లు అందిన సమాచారంపై చర్చించారు. వారికి పోలీసులు సహకరిస్తున్నారని తెలియడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఎర్రవల్లికి వెళ్లాలని నిర్ణయించారు. అయితే పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తారనే వార్తల నేపథ్యంలో ఎమ్మెల్సీలు మాత్రం సభలోనే ఉండాలని నిర్ణయించారు.

### బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట

ఎర్రవల్లిలో కేసీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అయితే రాజీవ్ రహదారి మీదుగా ఎర్రవల్లికి వెళ్లే క్రమంలో నగర శివారులోని బొల్లారం, హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై నిరసన తెలుపుతూ తమ వాహనాల నుంచి దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలి నడకన ఎర్రవల్లికి బయలుదేరారు. అయితే హరీశ్‌రావుతో పాటు కొందరు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపిన కేటీఆర్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యేలను బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పార్టీ ఎమ్మెల్యేల అరెస్టు వార్తను తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్లకు చేరుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. బోయినపల్లి పోలీసు స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం తోపులాటకు, దాడికి దిగాయి. సాయంత్రం ఐదు గంటల వరకు నేతలను పోలీసు స్టేషన్‌లోనే నిర్బంధించిన పోలీసులు ఆ తర్వాత వదిలి పెట్టారు. పోలీసు నిర్బంధం నుంచి విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సాయంత్రం తిరిగి అసెంబ్లీకి చేరుకున్నారు.

### నిరసనలు..ధర్నా

తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీ బయట పోలీసులు దురుసుగా వ్యవహరించారని, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మంగళవారం శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చింది. మరోవైపు తమ పార్టీ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేయడంపై మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ నిరసన తెలపడంతో సమావేశాలకు అంతరాయం కలిగింది. తర్వాత సాయంత్రం మధు, నవీన్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. మండలి చైర్మన్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో జరిగిన నిరసనలో ఏకపక్షంగా సస్పెన్షన్ విధించి సభను వాయిదా వేసుకుని వెళ్లారని విమర్శించారు. సస్పెన్షన్‌కు సంబంధించిన శాసనసభ తీర్మానం కాపీని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చ లేకుండా ఎమ్మెల్సీల సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కొద్దిసేపు గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ.. ధర్నా నిర్వహించారు. ఆ తరువాత వారిని పోలీసులు అక్కడ నుంచి పంపించేశారు. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా అసెంబ్లీ మార్షల్స్ ఆయనను అడ్డుకున్నారు. మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లడంతో బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్‌ను ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండిపడ్డారు.

# కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విభేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు



బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది.

బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

### సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్?ను బీఆర్?ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### తాతా మధు మాట్లాడకుండా అడ్డుకున్న మార్షల్స్

తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు బీఆర్?ఎస్?ఎల్పీలో ఆ పార్టీ సభ్యులు సమావేశమయ్యారు.

## ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్–సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

## స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

-మొదటిపేజీ తరువాయి



సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.

చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారు

సభను సజావుగా నడిపించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ వాదించారు. ప్లకార్డులు, రాతలతో కూడిన నల్ల టీషర్టులతో శాసనసభలోకి ప్రవేశం లేదన్నారు. స్పీకర్ ఆదేశాలతో చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ సీపీ ఆదేశాలు కూడా అమల్లో ఉన్నాయని ఏజీ వాదించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేలను శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసులు అడ్డుకున్నారని ఏజీ వాదనలు వినిపించారు.

### మహిళా పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారు

విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని న్యాయస్థానం దృష్టికి ఏజీ తీసుకొచ్చారు. ఇతర పోలీసు అధికారులను కూడా దూషించారని ఏజీ తెలిపారు. నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఏజీ కోర్టుకు తెలిపారు. ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న కోర్టు ఉత్తర్వులను సవరించాలని ఏజీ కోరారు.

### స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా?

అయితే ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, శాసనసభ నియమావళిని ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కదా అని ఏజీని ప్రశ్నించింది. పోలీసులు ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎందుకు అనుచితంగా ప్రవర్తించారని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు ఎవరితోనూ అలా ప్రవర్తించలేదని, మహిళా ఎమ్మెల్యేలను లోపలికి వెళ్లకుండా అడ్డుకోలేదని ఏజీ వాదించారు. నియమావళిలోని విషయాలను శాసనసభ్యులకు ఘటన కంటే ముందే తెలియజేశారా అని హైకోర్టు ప్రశ్నించగా, సాధారణంగా అమల్లో ఉండే నిబంధనలేనని ఏజీ తెలిపారు.

### తెలంగాణ భవన్‌కు ఎందుకు తీసుకెళ్లారు

సభ్యులను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదించారు. చీఫ్ మార్షల్?కు స్పీకర్ ఆదేశాలున్నట్లు ఎలాంటి లేఖలు ప్రభుత్వం సమర్పించలేదన్నారు. ఎమ్మెల్యేలు ఏదైనా నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు కానీ పోలీసులు కాదని బీఆర్ఎస్ న్యాయవాది వాదించారు. నిన్న పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్?లో పేర్కొన్న అంశాలనే ప్రభుత్వం కౌంటర్?గా దాఖలు చేసిందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని, భావిస్తే సదరు ఎమ్మెల్యేలను స్పీకర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, అరెస్ట్ చేసి తెలంగాణ భవన్?కు ఎందుకు తీసుకెళ్లారని వాదించారు. సోమవారం నాటి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## బిజినెస్

### రేపే యాపిల్ ఈవెంట్..
### ఫోల్డబుల్ ఐఫోన్, ఐఫోన్ 18 ప్రో విడుదల



యాపిల్ బ్రాండ్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాపిల్ ఈవెంట్ సెప్టెంబర్ 9, బుధవారం జరగనుంది. అమెరికా (క్యాలిఫోర్నియా)లోని యాపిల్ పార్క్‌లో ఈవెంట్ జరగనుంది. యాపిల్ మోస్ట్ అవైటెడ్ ఫోల్డబుల్ ఫోన్ ఈ ఈవెంట్‌లోనే రిలీజ్ కానుంది. ఇప్పటికే సాంసంగ్, మోటా వంటి అనేక సంస్థలు ఫోల్డబుల్ ఫోన్స్ రిలీజ్ చేశాయి. కానీ, టాప్ బ్రాండ్ యాపిల్ మాత్రం తన ఫోల్డబుల్ తీసుకురావడానికి ఇంతకాలం పట్టింది. దీంతో బుధవారం రిలీజ్ కానున్న యాపిల్ ఫోన్ ఎలా ఉంటుందా అనే అంచనాలు పెరిగిపోతున్నాయి. ఫోల్డబుల్ ఫోన్‌తోపాటు ఐఫోన్ 18ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ఫోన్లు కూడా బుధవారమే విడుదల కానున్నాయి. వీటితోపాటు యాపిల్ వాచ్ కూడా రిలీజవనుంది. యాపిల్ వాచ్ 12 పేరుతో ఈ స్మార్ట్‌వాచ్ రిలీజ్ కానుంది. అలాగే, ఎయిర్‌పాడ్స్ వెర్షన్ 5 కూడా రిలీజయ్యే ఛాన్స్ ఉంది. అయితే, వీటి విడుదలపై అధికారిక ప్రకటన మాత్రం లేదు. ఈవెంట్ తర్వాతే రిలీజవుతున్న డివైజెస్‌పై క్లారిటీ వస్తుంది. అందుకే, యాపిల్ లవర్స్ దీనికోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఈవెంట్‌లో యాపిల్ నూతన సీఈవో జాన్ టెర్నస్ హాజరుకానున్నారు. ఆయన ఈవెంట్‌లో పాల్గొనడం ఇదే తొలిసారి. ప్రస్తుతం చిప్స్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఫోన్లు, ఇతర డివైజెస్ రేట్లు అధికంగానే ఉండే ఛాన్స్ ఉంది. ఈ ఈవెంట్‌కు యాపిల్ మాజీ సీఈవో టిమ్ కుక్ కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి. ఆయన ఈ నెల 1న సీఈవో నుంచి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మారిన సంగతి తెలిసిందే. దీంతో ఇద్దరిలో ఎవరు కొత్త ఫోన్స్ లాంచ్ చేస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

### కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు
### అదానీ, ఎన్టీపీసీ నుంచి దరఖాస్తులు

**ఇంటర్నెట్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక ప్రాజెక్టుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్టీపీసీ తాల్చేర్ ఫెర్టిలైజర్స్ వంటి సంస్థలు దరఖాస్తు సమర్పించాయి. యూరియా తయారీ కోసం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తం 7 దరఖాస్తులు రాగా.. అందులో యూరియా ప్రాజెక్టుకు అదానీ గ్రూపు దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. సింథటిక్ నేచురల్ గ్యాస్‌కు-ఎన్టీపీసీ, సింథసిస్ గ్యాస్‌కు శ్యామ్ సెల్ ఫ పవర్ వంటి కంపెనీలు దరఖాస్తులు సమర్పించాయి. మొదటి దరఖాస్తుల విండో సెప్టెంబర్ 7న ముగియగా.. సెప్టెంబర్ 8 నుంచి రెండో దశ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించాలని కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.

# రిలయన్స్ భారీ ప్లాన్..
## మూడేళ్ల తర్వాత బాండ్ మార్కెట్‌లోకి!




ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ దాదాపు మూడేళ్ల తర్వాత.. మళ్లీ ఇండియా రూపీ బాండ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే.. కంపెనీ భారీ మొత్తంలో నిధులను సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ బాండ్ ఇష్యూ పూర్తయితే, 2023 నవంబర్ తర్వాత ఒక రేటెడ్ కంపెనీ చేపట్టే అతిపెద్ద సింగిల్-ట్రాంచ్ ఫండ్ రైజింగ్‌గా నిలిచే అవకాశం ఉంది.

**రూ.12,500 కోట్ల సమీకరణ**

రిలయన్స్ ఇండస్ట్రీస్ సుమారు రూ.12,500 కోట్లను సమీకరించాలని చూస్తోంది. ఇందుకోసం ఐదేళ్ల కాలపరిమితి ఉన్న బాండ్లను జారీ చేయనుంది. ఈ బాండ్లపై ఏడాదికి 7.47 శాతం వడ్డీ చెల్లించే అవకాశం ఉంది. ఇన్వెస్టర్ల నుంచి బిడ్లను సెప్టెంబర్ 18తో ముగిసే వారంలో ఆహ్వానించే అవకాశం ఉందని సమాచారం.

**2023 తర్వాత తొలిసారి**

రిలయన్స్ ఇండస్ట్రీస్ చివరిసారిగా 2023 నవంబర్‌లో దేశీయ రూపాయి బాండ్ మార్కెట్ ద్వారా నిధులు సమీకరించింది. అప్పుడు కంపెనీ ఏకంగా రూ.20,000 కోట్లను సమీకరించింది. దీంతో ఇది భారతదేశంలో నాన్-ఫైనాన్షియల్ కంపెనీ చేపట్టిన అతిపెద్ద లోకల్ కరెన్సీ డెట్ ఇష్యూగా నిలిచింది. ఇప్పుడు మరోసారి భారీ మొత్తంలో నిధులు సమీకరించేందుకు రిలయన్స్ సిద్ధమవుతుండటం మార్కెట్‌లో ఆసక్తిని పెంచుతోంది.

**రూపాయి బాండ్ల వైపు ఎందుకు?**

ప్రస్తుతం భారత్‌లో ఐదేళ్ల వరకు ఉన్న బాండ్లపై వడ్డీ రేట్లు గణనీయంగా తగ్గాయి. దీంతో డాలర్లలో రుణాలు తీసుకోవడం కంటే రూపాయిల్లో బాండ్లు జారీ చేసి నిధులు సమీకరించడం కంపెనీలకు చౌకగా మారింది. జూన్ ప్రారంభం నుంచి ఐదేళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి దాదాపు 33 బేసిస్ పాయింట్లు తగ్గింది. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి దేశంలోకి వచ్చిన భారీ డాలర్ ప్రవాహాలు. అదే సమయంలో అమెరికా ట్రెజరీ బాండ్లపై వడ్డీ రేట్లు పెరగడంతో డాలర్లలో రుణాలు తీసుకోవడం భారతీయ కంపెనీలకు మరింత ఖరీదుగా మారింది. ఈ పరిస్థితి కూడా రిలయన్స్ వంటి సంస్థలను దేశీయ బాండ్ మార్కెట్ వైపు ఆకర్షిస్తోంది.

**10 ఏళ్ల బాండ్స్**

ఈ బాండ్ ఇష్యూకు కొన్ని పెద్ద ప్రైవేట్ బ్యాంకులు అరేంజర్లుగా వ్యవహరించనున్నాయి. అంతేకాకుండా.. ఈ బాండ్లలో కొంత భాగాన్ని ఆ బ్యాంకులే కొనుగోలు చేసే అవకాశం కూడా ఉందని సమాచారం. ఐదేళ్ల బాండ్లతో పాటు 10 ఏళ్ల కాలపరిమితి ఉన్న బాండ్లను కూడా జారీ చేయాలా అనే విషయంపై రిలయన్స్ ఆలోచిస్తోంది. ఇందుకోసం బ్యాంకర్లు, ఇన్వెస్టర్లతో కంపెనీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

## ఈవీ అమ్మకాల జోరు.. 2.98 లక్షల యూనిట్లు విక్రయం

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో ఎలక్ట్రిక్ వాహన విక్రయాల జోరు పెరిగింది ఆగస్టులో మొత్తం 2.98 లక్షల ఈవీలు అమ్ముడయ్యాయి. గతేడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదు చేశాయి. మొత్తంగా మార్కెట్ వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) వెల్లడించింది. ఎలక్ట్రిక్ టూవీలర్ సెగ్మెంట్‌లో 1,83,204 వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాది నమోదైన 1,09,673 యూనిట్లతో పోలిస్తే 67.05 శాతం పెరిగాయి. కానీ జులైతో పోలిస్తే 10.37 శాతం తగ్గుముఖం పట్టాయి. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాలు గతేడాదితో పోలిస్తే 51.89 శాతం వృద్ధితో 30,696 యూనిట్లు సేల్ అయ్యాయి. జులైతో పోలిస్తే 6.78 శాతం తగ్గాయి. త్రీ వీలర్ సెగ్మెంట్‌లో రిటైల్ విక్రయాలు 79,846 యూనిట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే 25.28శాతం వృద్ధి చెందగా, జులైతో పోలిస్తే 8.28 శాతం తక్కువ. ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ విక్రయాలు దాదాపు మూడింతలు అయ్యాయి. గతేడాదితో పోలిస్తే 188.3 శాతం వృద్ధితో 4,702 యూనిట్లు అమ్ముడయ్యాయి. జులైతో పోలిస్తే 32.23 శాతం పెరుగుదల సాధించింది.



# తిలక్ అజేయ అర్ధశతకం..
# ఫైనల్లో ఎదురీదుతున్న సౌత్..!



దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ పట్టుబిగించగా.. సౌత్ జోన్ ఎదురీదుతోంది. చిదంబరం స్టేడియంలో ఈస్ట్ బౌలర్ల ధాటికి ఓపెనర్లు తేలిపోగా దేవ్‌దత్ పడిక్కల్(62) అర్ధ శతకంతో మెరిశాడు. మహమ్మద్ షమీ(2-17), ముకేశ్ కుమార్(2-36)లు ఆరంభంలోనే దెబ్బకొట్టినా.. పడిక్కల్, కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్) నిలబడడంతో ఈస్ట్ కాస్త కోలుకుంది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆరు వికెట్లు కోల్పోయిన సౌత్ 466 పరుగులు వెనకబడి ఉంది. ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తడబడుతోంది. చిదంబరం స్టేడియంలో ఇషాన్ కిషన్(270) రికార్డు డబుల్ సెంచరీతో భారీ స్కోరందించగా.. ఈస్ట్ బౌలర్లు ముకేశ్ కుమార్(2-36), మహమ్మద్ షమీ(2-17)లు ఆదిలోనే సౌత్‌ను తీసి దెబ్బతీశారు. మూడో రోజు తొలి సెషన్‌లోనే రికీ భుయి(1)ని ముకేశ్ పెవిలియన్ పంపగా.. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్(32)ను శిఖర్ మోహన్ ఔట్ చేశాడు. అంతే.. 70 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. ఓపెనర్లు విఫలమైనా దేవదత్ పడిక్కల్ (62) అర్ధ శతకంతో మెరిశాడు.

**తిలక్ నిలబడ్డాడు..**

శ్రీలంక పర్యటనలో సెంచరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఈస్ట్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే.. అతడిని ముకేశ్ వెనక్కి పంపి రెండో వికెట్ సాధించాడు. ఆ తర్వాత షేక్ రషీద్(27), స్మరణ్ రవిచంద్రన్(23)లను షమీ బోల్తా కొట్టించాడు. అంతే.. 174కే ఈస్ట్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్), శ్రేయాస్ గోపాల్(26)లు కీలక భాగస్వామ్యంతో ఆదుకున్నారు. టీ సెషన్‌లో నింపాదిగా ఆడిన వీరు ఆరో వికెట్‌కు 70కి పైగా రన్స్ జోడించారు. అయితే.. గోపాల్‌ను ఖరేషి ఔట్ చేసి సౌత్‌కు షాకిచ్చాడు. అయినా సరే తిలక్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడాడు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి సౌత్ ఆరు వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 466 పరుగులు వెనకబడి ఉంది. మరొక్క రోజే ఆట మిగిలి ఉండడంతో ఈస్ట్ జోన్ టైటిల్‌ను ముద్దాడడం లాంఛనమే.

### కాషాయం కథ ముగిసె..
### ఆసియాడ్‌లో నీలం జెర్సీతో టీమిండియా..!



భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్ ముందు నీలం రంగు స్థానంలో కాషాయంను ప్రవేశపెట్టడంపై విమర్శలు రాగా.. ఆ టోర్నీలో అదే జెర్సీతో ఆడిన టీమిండియా నిరాశపరిచింది. దాంతో.. రాబోయే టోర్నమెంట్లలో మునుపటి బ్లూ కలర్‌నే కొనసాగించాలని భారత జట్టు నిర్ణయించుకుందని సమాచారం. త్వరలో జరగనున్న 20వ ఆసియా క్రీడల్లో హర్మన్‌ప్రీత్ సింగ్, సలీమా టెటె సారథ్యంలోని జట్లు తమకు అచ్చొచ్చిన నీలంతోనే బరిలోకి దిగనుందని హాకీ ఇండియా వర్గాలు చెబుతున్నాయి. భారత హాకీలో కాషాయం కథ ముగిసింది. ఆగస్టులో జరిగిన ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో ఆరెంజ్ జెర్సీతో ఆడిన టీమిండియా.. ఈసారి సంప్రదాయ నీలం రంగుకే ఓటేయనుంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో నీలం రంగు జెర్సీతోనే భారత పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయని సమాచారం. ఈ మెగా ఈవెంట్‌లో తొలి ప్రాధాన్య కిట్ రంగుగా నీలం ఉండనుందని హాకీ ఇండియా తెలిపింది. 'ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్ల తొలి ప్రాధాన్య కిట్‌గా దేన్ని ఎంచుకుంటారు? అని భారత ఒలింపిక్ సంఘం అడిగింది. అందుకు.. మేము నీలం అని చెప్పాం. రెండో ప్రాధాన్య రంగుగా కాషాయాన్ని ఎంచుకున్నాం' అని స్పోర్ట్స్ స్టార్‌తో హాకీ ఇండియా మీడియా ప్రతినిధి శేఖర్ మనోహరన్ వెల్లడించాడు. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. అక్టోబర్ 2న మహిళల హాకీ ఫైనల్, అక్టోబర్ 3న పురుషుల హాకీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

## స్పోర్ట్స్

### అఫ్గనిస్థాన్‌తో టీ20లకు సుందర్ ఫిట్..
### బుమ్రాపై నిర్ణయం ఆరోజే..!



శ్రీలంక పర్యటనకు దూరమైన భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్ సాధించాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన ఈ స్పిన్ ఆల్‌రౌండర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. దాంతో.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సుందర్ ఆడడం ఖాయమైంది. మరో నాలుగు రోజుల్లో తొలి మ్యాచ్ ఉన్నందున ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ స్పీడ్‌స్టర్ ఫిట్‌నెస్‌పై సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నాడు నిర్ణయం వెలువడనుంది. అఫ్గనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు మరో నాలుగు రోజులే ఉంది. స్వదేశంలో జరుగుతున్న ఈ సిరీస్‌కు ఎంపికైన ఆటగాళ్ల ఫిట్‌నెస్ కోసం నిరీక్షిస్తున్న భారత జట్టుకు గుడ్‌న్యూస్. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమైన సుందర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో గట్టెక్కాడు. అయితే.. ఇప్పటికీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే ఉన్న జస్ప్రీత్ బుమ్రా, పేస్ ఆల్‌రౌండర్లు హర్షిత్ రానా, నితీశ్ కుమార్ రెడ్డిల ఫిట్‌నెస్‌పై స్పష్టత రాలేదు. ఈ ముగ్గురు ఫిట్‌గా ఉన్నారా? లేదా? అనే విషయంపై సెప్టెంబర్ 9న బీసీసీఐ ప్రకటన చేయనుంది. సెప్టెంబర్ 13వ తేదీన కాబూల్‌లో తొలి టీ20తో సిరీస్ మొదలవ్వనుంది. భారత స్క్వాడ్: శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివం దూబే, నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్, సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, బుమ్రా, అర్ష్‌దీప్, హర్షిత్ రానా.



## బ్రిటిష్ కాలం నాటి సాహస యాత్ర విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్ అప్‌డేట్!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, ట్యాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించారు. సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చేలా రూపొందించిన ఈ చిత్ర టీజర్‌ను సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 4:05 నిమిషాలకు విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. ది లెజెండ్ ఆఫ్ ది కర్సడ్ ల్యాండ్ రైజెస్ అనే క్యాప్షన్‌తో వస్తున్న ఈ అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట విశేషంగా వైరల్ అవుతోంది. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ కాలం నాటి వాస్తవిక చారిత్రక సంఘటనలు, అణచివేతకు వ్యతిరేకంగా సాగే పోరాటం నేపథ్యంలో ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్-ఇండియా చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టి-సిరీస్ సమర్పిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్-అతుల్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ పీరియడ్ డ్రామాను దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

## చిరంజీవి 'కాకా'లో అనస్వర రాజన్.. ఎంబీబీఎస్ స్టూడెంట్‌గా ఫస్ట్ లుక్ అదిరింది!




మలయాళం ఇండస్ట్రీలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక అనస్వర రాజన్ ఇప్పుడు తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతున్న ఈ మలయాళీ బ్యూటీ.. తాజాగా మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టాలీవుడ్‌లో ఆమె జోరు మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం అనస్వర రాజన్ చేతిలో ఉన్న ప్రాజెక్టుల్లో 'కాకా' మాత్రం ఆమె కెరీర్‌లోనే అత్యంత కీలకమైన చిత్రంగా నిలవనుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో అనస్వర ఓ కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్రపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో అనస్వరను ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా పరిచయం చేశారు. చాలా సహజమైన, హోమ్లీ లుక్‌లో కనిపిస్తున్న ఆమె ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ గ్లామర్ లుక్‌కు భిన్నంగా.. ఓ మెడికల్ స్టూడెంట్‌గా అనస్వరను చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె పాత్ర సినిమాకు కథాపరంగా ఎంత ముఖ్యమో పోస్టర్‌లోనే హింట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అనస్వర వెనుక భాగంలో నీడలా కనిపిస్తున్న చిరంజీవి పాత్ర.. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఆసక్తిని పెంచుతోంది.'కాకా' సినిమాలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రి-కూతుళ్ల అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## యష్ 'టాక్సిక్'కు ఓటీటీ షాక్.. రూ.150 కోట్ల ఆఫర్ నుంచి రూ.30 కోట్లకు పడిపోయిందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత యష్ నటించిన సినిమా కావడంతో ఈ మూవీపై దేశవ్యాప్తంగా భారీ హైప్ ఏర్పడింది. అయితే థియేటర్లలో మాత్రం సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయిందనే టాక్ వచ్చింది. ఇప్పుడు అదే ప్రభావం 'టాక్సిక్' డిజిటల్ రైట్స్‌పై పడినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు భారీ మొత్తంలో ఓటీటీ సంస్థలు ఆఫర్లు ఇచ్చినప్పటికీ.. సినిమా ఫలితం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి. 'టాక్సిక్'పై విడుదలకు ముందు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం సుమారు రూ.150 కోట్ల ఆఫర్ చేసినట్లు సమాచారం. యష్ క్రేజ్‌తో పాటు సినిమాకు ఉన్న భారీ బజ్, టీజర్‌లో కనిపించిన బోల్డ్ కంటెంట్, స్టార్ హీరోయిన్ల గ్లామర్ వంటి అంశాలు ఈ ఆఫర్‌కు కారణమని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఈ ఆఫర్‌ను మేకర్స్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. థియేటర్లలో సినిమా భారీ విజయం సాధిస్తే డిజిటల్ రైట్స్ విలువ మరింత పెరిగి రూ.200 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని భావించినట్లు టాక్. కానీ బాక్సాఫీస్ ఫలితం అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు లెక్కలు పూర్తిగా మారిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'టాక్సిక్' డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ కోసం జీ5 సుమారు రూ.30 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు వచ్చిన రూ.150 కోట్ల ఆఫర్‌తో పోలిస్తే ఇది చాలా తక్కువ మొత్తం. అంటే సినిమా విడుదలకు ముందు ఉన్న అంచనాలు, విడుదల తర్వాత వచ్చిన ఫలితం ఓటీటీ మార్కెట్‌పై ఎంత ప్రభావం చూపించాయో ఈ సంఖ్యలు చెబుతున్నాయని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే రూ.150 కోట్ల ఆఫర్, రూ.30 కోట్ల ప్రస్తుత ఆఫర్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అందువల్ల ఇవి ప్రస్తుతం మీడియా, ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారంగానే చూడాల్సి ఉంటుంది. పాన్ ఇండియా సినిమాలకు థియేట్రికల్, ఓటీటీతో పాటు శాటిలైట్ రైట్స్ కూడా కీలక ఆదాయ వనరుగా ఉంటాయి. అయితే 'టాక్సిక్' విషయంలో 'ఏ' సర్టిఫికెట్ కంటెంట్ కారణంగా టెలివిజన్ ప్రసారానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం. టీవీలో ప్రసారం చేయాలంటే సినిమాలోని కొన్ని సన్నివేశాలను తొలగించి లేదా మార్చి కొత్త వెర్షన్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. అందుకే శాటిలైట్ హక్కుల కోసం ప్రత్యేకంగా ఎడిట్ చేసిన వెర్షన్‌ను రూపొందించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఓటీటీ కోసం కూడా అవసరానికి అనుగుణంగా మరో వెర్షన్ సిద్ధం చేయాలనే ఆలోచన ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.




## సెన్సార్ పూర్తి చేసుకున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'.!

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్ నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ చిత్రంలో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్ మరియు మాళవికా నాయర్ నటిస్తుండగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అప్పు రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాగమయూరి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిప్స్ బ్యానర్లపై మధు కాలిపు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512